# సింగరేణీయుల సమాచారం

ఒకే కుటుంబం - ఒకే లక్ష్యం - ఒకే గమ్యం... - ఇదే సింగరేణి స్ఫూర్తి



## ప్రగతి పథంలో మరో ముందడుగు

## విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి

## మన సింగరేణి



చైర్మన్ లేఖ

# సింగరేణి బంగారు భవిష్యత్తు కోసమే విద్యుత్ కేంద్రస్థాపన



ప్రియమైన సింగరేణీయులకు ...

**శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో గల జైపూర్ వద్ద 600 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మన సంస్థ శ్రీకారం చుట్టిన విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను.**

నూట ఇరవై సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఇదొక కొత్త అధ్యాయం. ఇది మన సంస్థకే కాదు, మన ప్రాంతానికీ, మన రాష్ట్రానికీ, మన దేశానికీ కూడా గర్వకారణం. దీనికి సంబంధించిన నేపథ్యాన్ని మీకు వివరిస్తున్నాను. నానాటికీ పెరుగుతున్న ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్న దశలో బొగ్గు ఉత్పత్తి సంస్థగా మన లక్ష్యాలను పెంచుకోవడంతోపాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా కూడా జాతి అవసరాలను తీర్చడంలో సింగరేణి ఎప్పుడూ ముందుంటుందని నిరూపించదలిచాం. దీని నిర్మాణానికి అవసరమైన మూలధనంలో 30 శాతాన్ని మన సంస్థ, మిగిలిన 70 శాతం నిధులను బ్యాంకులు, ఆర్థికసంస్థల ద్వారా సమకూర్చుకోవాలని నిర్ణయించుకోవడం జరిగింది. దీనిలో భాగంగా ఈ ఏడాది (2010-11)లో మన సంస్థ 540 కోట్ల రూపాయలను దీనికోసం కేటాయించింది.

2013 నాటికి ఈ విద్యుత్ సంస్థ నిర్మాణం పూర్తయి 600 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనుంది. తద్వారా మన సంస్థ ఏటా సుమారు 300 కోట్ల రూపాయల వరకూ లాభాలను ఆర్జించగలదని నమ్ముతున్నాం. సంస్థాపరంగా ఆలోచిస్తే విద్యుత్ పరిశ్రమలోకి అడుగుపెట్టడం అనేది మన బంగారు భవిష్యత్తు కోసమే అని స్పష్టం చేస్తున్నాను.

ఈ లాభాలు మన సంస్థ పురోభివృద్ధికి ఊతం కావాలన్నదే మన ఆలోచన. రాబోయే కాలంలో బొగ్గు నిల్వల లోతు క్రమంగా పెరగడం వల్ల ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగిపోవడం, అలాగే ఓసి గనుల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాల పర్యవసానంగా లాభాలు కూడా క్షీణించే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో కంపెనీని మంచి ఆర్థిక పరిపుష్టితో ఇదేవిధంగా కొనసాగించాలంటే ప్రత్యామ్నాయ ఆదాయవనరుగా విద్యుత్ సంస్థ ఉపయోగపడాలన్న ముందుచూపుతోనే దీనికోసం పూనుకోవడం జరిగింది.

దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎంతో సహకరించి ప్రోత్సహించాయి కూడా. అనతికాలంలోనే మన స్వప్నం నిజమై **"మనం బొగ్గుతోపాటు విద్యుత్ కూడా ఉత్పతి చేస్తాం"** అని సింగరేణీయులందరూ సగర్వంగా చెప్పుకొనే శుభఘడియలు రావాలని కోరుతూ మరోమారు మీ అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ముగిస్తున్నాను.

**జై సింగరేణి, జైహింద్**

**యస్. నర్సింగ్‌రావు**
**చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్**

# సింగరేణీయుల సమాచారం

ఎడిటోరియల్

సంచిక : 1/2010 సంపుటి : 48


## లో.ప.లి.పే.జీ.ల్లో


**ప్రగతిపథంలో మరో కొత్త అధ్యాయం** — 2

మన సంస్థ ఈ ఏడాది కొత్తగా విద్యుత్ ఉత్పాదన రంగంలోకి అడుగిడింది. శ్రీరాంపూర్ ఏరియా జైపూర్‌వద్ద జరిగిన విద్యుత్ కర్మాగారం శంఖుస్థాపన విశేషాలు

**అతిపెద్ద భూగర్భగని అడ్రియాలా లాంగ్‌వాల్** — 3

సింగరేణిలో అతిపెద్ద లాంగ్‌వాల్‌కి కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది ఈ ప్రాజెక్ట్ విశేషాలతో కూడిన ప్రత్యేక వార్త

**ప్రగతిబాట** — 4

సింగరేణిలో 'బూ'పద్ధతిలో కోల్‌వాషరీల ఏర్పాటు – లాభాలు, వాషరీల పనివిధానంపై ప్రత్యేక వార్త

**స్ఫూర్తిదాయకం** — 5

రచయిత శిల్పి శ్రీ బొమ్మరాత ఎల్లయ్య

కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ చాంపియన్ – శ్రీ ఓరం సురేష్, వన్యప్రాణుల రక్షణకు ప్రచారం చేస్తున్న ఉద్యోగి శ్రీ చంద్రశేఖర్‌ల కృషిపై ప్రత్యేక వార్తలు

**స్వయం ఉపాధి** — 6 & 7

స్వయం ఉపాధి కోసం చూసే యువతీయువకులకోసం అందుబాటులో గల అనేక రకాల శిక్షణలు, ఋణసౌకర్యాలపై స్పెషల్ స్టోరి, సేవా సమితి ఉత్పత్తిదారులకు మార్కెటింగ్ కోసం హైదరాబాద్‌లో ఒక షాపు ప్రారంభం మొదలైన వార్తలు

**మన సింగరేణి** — 8

రామగుండం –2లో జరిగిన ఇంటర్ ఏరియా మైన్స్ రెస్క్యూ పోటీలు, కొత్తగూడెంలో జరిగిన సింగర్ ఆఫ్ సింగరేణి కార్యక్రమాల విశేషాలు

**ప్రారంభోత్సవాలు** — 9

భూపాలపల్లిలో కార్మికుల సొంత ఇంటి పథకం ప్రారంభం, కె.టి.కె.–6, జి.డి.కె.–10 మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌ల ప్రారంభం, కొత్తగూడెంలో మహిళా కళాశాల ఆడిటోరియం ప్రారంభం విశేషాలు

**సెంటర్ స్ప్రెడ్** — 10

భూపాలపల్లిలో ఘనంగా జరిగిన సింగరేణి దినోత్సవం సెంట్రల్ ఫంక్షన్ విశేషాలు, వివిధ ఏరియాల్లో జరిగిన వేడుకల ఫోటో ఫీచర్

**గణతంత్ర దినోత్సవ వేడుకలు** — 12

కొత్తగూడెంలో జరిగిన సెంట్రల్ ఫంక్షన్ విశేషాలు, అన్ని ఏరియాల్లో జరిగిన గణతంత్ర వేడుకల చిత్రమాలిక

**వార్తలు** — 13

బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు, మణుగూరులో స్వైన్ ఫ్లూ అవగాహనా కార్యక్రమాలు, సింగరేణికి వందనం, వృక్షనివేదన (కవితలు),

సింగరేణి మహిళా జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల వార్షికోత్సవాలు, కోల్ ఇండియా పోటీలలో పాల్గొనేందుకై కంపెనీస్థాయి సాంస్కృతిక పోటీలు — 14

**వార్తాచిత్రాలు** — 15

**సమీప గ్రామాల సేవలో** — 16

రామగుండం–3 ఏరియా పరిధిలోని రామయ్యపల్లిలో ఉచిత వైద్యసేవలు, సింగరేణి సేవలపై పెద్దంపేట్ సర్పంచ్ స్పందన, మణుగూరులో టిటిసి సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు

**పత్రికపై స్పందనలు** — 17

**భూభ్రమణం** — 18

**పాటలు- కవితలు** — 19

**పాత జ్ఞాపకాలు** — 20


## అతి పనికిరాదు

మనం సాధారణంగా ఒకమాట అంటూ ఉంటాం. మరీ అతి పనికిరాదు అని. ఇది ఫలానా సందర్భానికే పరిమితమైన మాటకాదు. ఏ సందర్భానికైనా సరిపడే మందలింపు లాంటి మంచిమాట.

సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాక వాటి వాడకం విపరీతంగా పెరిగిపోయింది. కావల్సిన మనిషితో ఎక్కడున్నా క్షణాల్లో మాట్లాడగలుగుతున్నాం. ఇది ఒక సౌకర్యం. కానీ ఈ సౌకర్యానికి ఉచిత పథకాలు, ప్రత్యేక ప్యాకేజీలు తోడవడంతో గంటలతరబడి సెల్‌ఫోన్ల వాడకం ఎక్కువైంది. అదేపనిగా అవసరం ఉన్నా, లేకున్నా సెల్స్ వాడడం అతి కిందికే వస్తుంది. ఈ అతి వలన కర్ణభేరికి, దానివెనుక ఉన్న మెదడుకు కూడా నష్టం కలగవచ్చని శాస్త్రజ్ఞులు ముందస్తుగా హెచ్చరిస్తున్నారు.

కనుక ఉచితమనో, కాలక్షేపానికనో చెప్పి ఉన్న సౌకర్యాలను అతిగా వాడితే అనర్థమే మరి. ఇదే విషయాన్ని మనం మంచినీరు, విద్యుత్తు, గ్యాసు వంటి వాటికి కూడా వర్తింపజేసుకోవాల్సి ఉంటుంది. అవసరం లేకపోయినా ఉపయోగించే ఫ్యాన్లు, బల్బులు వాడడం అరికట్టి దేశసంపదను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్. చంద్రశేఖర్, సి.పి.ఆర్.ఓ.
ఎడిటర్–ఇన్–చీఫ్


ఎడిటర్–ఇన్–చీఫ్ ఎస్. చంద్రశేఖర్, Chief Public Relations Officer

ఎడిటర్ గణాశంకర్ పూజారి, Communication Co-ordinating Officer

అసోసియేట్ ఎడిటర్స్ డి.వి. సుబ్బారావు, Public Relations Assistant, శ్రీమతి జె. సావిత్రి, Spl. Gr. Clerk

ఈ పత్రికను మన వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు : www.scclmines.com

ఈ పత్రికపై మీ అభిప్రాయాలను మాకు మెయిల్ చేయండి : E-mail: patrikae8@gmail.com




# రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె.రోశయ్య గారిచే సింగరేణి విద్యుత్ కర్మాగారానికి శంకుస్థాపన

**120 ఏళ్లుగా బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన మన సంస్థ తన వ్యాపార అభివృద్ధిలో భాగంగా విద్యుత్ ఉత్పాదన రంగంలోకి అడుగుపెడుతోంది. రు.2,700 కోట్ల వ్యయంతో శ్రీరాంపూర్ ఏరియా, జైపూర్ మండలంలో ఏర్పాటు చేయనున్న 600 మెగావాట్ల విద్యుత్ కర్మాగారం ఏర్పాటుకు పూనుకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కొణిజేటి రోశయ్యగారు ఫిబ్రవరి 14వ తేదీన దీనికి శంకుస్థాపన చేశారు. 2013 కల్లా ఈ కర్మాగారం నుంచి విద్యుత్ ఉత్పాదన ప్రారంభం కానుంది.**

విద్యుత్ కేంద్రం ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ చూపిన మన ఛైర్మన్ అండ్ ఎం.డి. కృషిని రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి (ఇండిపెండెంట్ చార్జ్) శ్రీ జైరాం రమేష్ తదితరులు కొనియాడారు. మారుమూల ప్రాంతంలో సింగరేణి నిర్మించనున్న ఈ పరిశ్రమ వలన ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందగలదని విశ్వాసం ప్రకటించారు. సభకు మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు స్వాగతం పలికారు. సభకు అదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మరియు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దానం నాగేందర్ అధ్యక్షత వహించారు. సభలో పెద్దపల్లి ఎం.పి. శ్రీ జి.వివేకానంద, ఎం.ఎల్.సి.లు శ్రీ బి.వెంకట్రావు, శ్రీ కె.ప్రేమ సాగర్‌రావు, ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ సిడెం గణపతి, ఎనర్జీశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీ సుతీర్థభట్టాచార్య, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ అహ్మద్ నదీమ్, మన డైరెక్టర్లు శ్రీ జె.వి.దత్తాత్రేయులు, శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్, శ్రీ ఇ.వి.కృష్ణారెడ్డి, శ్రీ కె.వి.రమణ, శ్రీ ఐ.వి.ఎన్.ప్రసాదరావు, స్థానిక నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



"ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకూ చిన్న పరిశ్రమలే ఉన్నాయి. 2,700 కోట్ల రూపాయలతో ఈ భారీ పరిశ్రమ స్థాపనకు కృషి చేసిన సింగరేణి సంస్థను, ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రి శ్రీ జైరాం రమేష్‌ను అభినందిస్తున్నాను. ఇది పూర్తయిన తర్వాత రెండోదశ కూడా వెంటనే ప్రారంభించాలి. ఇది ప్రభుత్వ ఉద్దేశం కూడా..."

**– శ్రీ కె. రోశయ్య, ముఖ్య మంత్రి**










"కనీసం ఒక్క ఎకరం అటవీ భూమి కూడా లేకుండా నిర్మిత మౌతున్న పవర్ ప్రాజెక్టు ఇది. దీనిలో ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించగలవని ఆశిస్తున్నాను. రెండోదశకు అనుమతి ఇచ్చేందుకు కూడా నా వంతు కృషి చేస్తాను. కేంద్ర మంత్రిగా సింగరేణికి, ఈ రాష్ట్రానికి నా శాయశక్తులా తోడ్పాటు నందిస్తాను."

**శ్రీ జైరాం రమేష్, కేంద్ర అటవీ, పర్యావరణశాఖ సహాయ మంత్రి**



"ఈ ప్రాజెక్టు నిర్మాణం సింగరేణికి ఎంతో గర్వకారణం. ఇక్కడ రైతుల భూములకు మార్కెట్టు రేటు కన్నా ఎక్కువగా చెల్లించి, మేలు చేసిన సింగరేణి యాజమాన్యానికి అభినందనలు తెలియ జేస్తున్నాను. ఇటువంటి మంచి ప్రాజెక్టుకు అనుమతించిన రైతులకు కూడా అభినందనలు."

**శ్రీ దానం నాగేందర్, రాష్ట్ర కుటుంబ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖామంత్రి, అదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి**



"ఈ ప్రాంత అభివృద్ధికి, దేశాభి వృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో తోడ్పడనుంది. అంతర్గత పెట్టుబడులతోనే దీనిని నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతి రావడానికి తోడ్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. రానున్న కాలంలో సింగరేణి సంస్థ అభివృద్ధి పథంలో నడవడానికి ఈ ప్రాజెక్టు ఎంతో సహకరించ నుంది."

**శ్రీ ఎస్.నర్సింగ్‌రావు, ఛైర్మన్ &ఎం.డి.**

# సింగరేణి చరిత్రలో మరో కొత్త అధ్యాయం - 600 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపన

**బొగ్గు ఉత్పత్తి రంగంలో పన్నెండు దశాబ్దాల చరిత్ర గలిగిన మన సింగరేణి "విద్యుత్ ఉత్పాదన రంగంలోకి కూడా అడుగిడుతూ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. 600 మెగావాట్ల సామర్థ్యంగల విద్యుత్ కేంద్రాన్ని ఆదిలాబాద్ జిల్లా చెన్నూరుకు సమీపంలో నిర్మించాలని నిర్ణయించింది. వ్యాపారాభివృద్ధి చర్యల్లో భాగంగా విద్యుత్ రంగంలోకి అడుగిడుతున్న మనం దీనిలో కూడా విజయులం అవుతామని ఆకాంక్షిద్దాం.**

## ప్రాజెక్టు విశేషాలు

- ఈ ప్రాజెక్టు నిర్మాణం 2013 కల్లా పూర్తవుతుంది.
- నిర్మాణ వ్యయం సుమారు 2700 కోట్లు.
- నిర్మాణ వ్యయం మొత్తం సింగరేణి సంస్థ సమకూర్చుకొంటోంది.
- నిర్మాణం పూర్తయినాక ఉత్పత్తి అయ్యే 600 మెగావాట్ల విద్యుత్‌లో 150 మెగావాట్లను సింగరేణి సంస్థ తన అవసరాలకు వాడుకొంటుంది. మిగిలిన 450 మెగావాట్లు ఎ.పి.జెన్‌కో వారికి అమ్ముతుంది.
- ఇలా రెండు విధాల కంపెనీకి లాభం చేకూరనుంది.
- నిర్మాణం విషయంలో ఎన్.టి.పి.సి. సంస్థ యొక్క సహకారం తీసుకొంటోంది మన సంస్థ.
- ప్రాజెక్టుకు కావాల్సిన యంత్రాలు విడిభాగాలను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ (బి.హెచ్.ఇ.ఎల్.) నుంచి సమకూర్చుకొంటున్నాం.
- ఈ పవర్ ప్లాంటుకు ఏడాదికి 250 లక్షల టన్నుల బొగ్గు కావాల్సి ఉంటుంది. శ్రీరాంపూర్ ఏరియాలో మూతపడిన 2, 2ఎ గనులను ఓపెన్‌కాస్టుగా మలచి, దీనినుంచి ఉత్పత్తయ్యే బొగ్గును పవర్ ప్రాజెక్టుకు సరఫరా చేయనున్నారు.
- బొగ్గు రవాణాను 11 కిలోమీటర్ల పొడవుగల మూసివున్న టన్నెల్ ద్వారా సరఫరా చేయనున్నారు. పవర్‌హౌజ్ కోసం కావాల్సిన ఒక టి.ఎం.సి. నీటిని, డా॥ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయరు లోనికి తీసుకొని వినియోగించనున్నారు.
- ఈ గని నుంచి 25 ఏళ్లపాటు బొగ్గు సరఫరా చేయడానికి కావాల్సిన నిల్వలు (650 లక్షల టన్నులు) ఉన్నాయి.

# సింగరేణిలో అతిపెద్ద భూగర్భగని అడ్రియాలా లాంగ్‌వాల్‌కి కేంద్ర క్యాబినెట్ కమిటి ఆమోదం

**సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కరీంనగర్ జిల్లాలోని గోదావరిఖని వద్ద ప్రారంభించాలని ప్రతిపాదించిన ఆడ్రియాల్ షాఫ్ట్ ప్రాజెక్టు (లాంగ్‌వాల్) అండర్ గ్రౌండ్ గనికి కేంద్ర క్యాబినెట్ కమిటి 10-12-2009న ఆమోద ముద్ర వేసింది. ఈ గని 2.81 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో సింగరేణిలో ప్రారంభించబడుతున్న అతిపెద్ద భూగర్భగని. ఈ గని రూ.846.06 కోట్ల ప్రణాళిక పెట్టుబడితో ప్రారంభించబడుతున్నది.**

కంపెనీలో ఇప్పటివరకు ప్రారంభించిన గనులలో అత్యధిక మొత్తంలో పెట్టుబడి కలిగివున్న గనిగా ఇది విశిష్టత సంతరించుకున్నది. అంతేకాకుండా అత్యధిక బొగ్గు ఉత్పత్తి సామర్థ్యంగల ఏకైక భూగర్భగని కూడా ఇదే. గతంలో సింగరేణిలో 1994 సం॥లో రామగుండం ఓపెన్‌కాస్ట్-2 ప్రాజెక్టుకు రూ.807.85 కోట్లు పెట్టుబడి పెట్టడం జరిగింది. ఆడ్రియాల్ షాఫ్ట్ ప్రాజెక్టులో 5 హారిజోన్స్‌లో లోతైన బొగ్గు పొరలలో 54.36 మిలియన్ టన్నుల నిల్వలున్నాయి. దీనిని వెలికి తీయడానికి లాంగ్‌వాల్ సెట్ మరియు రెండు క్వార్డ్ బొల్టర్స్‌ను వినియోగిస్తారు.

ఇప్పటికే పంచ్ ఎంట్రీ విధానం ద్వారా బొగ్గు పొరలను చేరుకునే మార్గాలను ప్రారంభించిన ఈ గనిలో లాంగ్‌వాల్ పద్ధతి ద్వారా సెప్టెంబర్, 2011 నాటికి ఉత్పత్తి ప్రారంభించబడుతుంది. ఈ గనిలో 810 నిపుణులైన ఉద్యోగుల ద్వారా 14.92 టన్నుల ఉత్పాదకత సాధిస్తారు. పూర్తి స్థాయిఉత్పత్తి సామర్థ్యం వినియోగంతో టన్నుకు ఉత్పత్తి ఖర్చు రూ.863లు కాగా, పెట్టుబడిపై 17.31% ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ వస్తుంది.

అవసరమైన నిధులలో రూ.632.85 కోట్లను అంతర్గత వనరుల ద్వారా మరియు మిగిలిన రూ.132.28 కోట్లను రుణంగా సమకూర్చుకోవటం జరుగుతుంది. అటవీ మంత్రిత్వశాఖ నుండి అవసరమైన పర్యావరణ అనుమతులు లభించాయి. దీనిని నుండి ఉత్పత్తి అయ్యే బొగ్గు ఎన్‌టిపిసి, రామగుండంకు సరఫరా చేస్తారు. చాలా లోతైన అనగా 300 నుండి 600 మీటర్ల లోతులోనుండి బొగ్గు ఉత్పత్తి ప్రతిపాదించడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వానికి చెందిన సి.ఎస్.ఐ.ఆర్.ఒ. రిసర్చ్ సంస్థతో సంప్రదించి అవసరమైన సాంకేతిక సూచనలను, సలహాలను తీసుకుంటున్నారు.

1983 సం॥లోనే కంపెనీ మెకనైజడ్ లాంగ్‌వాల్ మైనింగ్ యంత్రాల వినియోగాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు 10 యంత్రాలను వినియోగించి 28 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ప్రస్తుతం గోదావరిఖని, జిడికె 10 ఎ ఇంక్లయిన్ మరియు వకీల్‌పల్లి బ్లాక్‌లో రెండు లాంగ్‌వాల్ యంత్రాలు పనిచేస్తున్నాయి. 10 సం॥ల పాతవైన ఈ యంత్రాలు సంవత్సరానికి 5 నుండి 6 లక్షల టన్ను బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, అత్యధిక సామర్థ్యంగల యంత్రాల వినియోగంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా రెట్టింపవుతుంది. అందుకే సింగరేణి 2 × 860 కె డబ్ల్యు షేర్ కాబినేషన్‌తో (బొగ్గు పొరలను పెకిలించే యంత్రం) రెండు సిలిండర్స్ (లెగ్స్) 1152 టన్నుల రూఫ్ సపోర్ట్ సామర్థ్యం గల అధునాతన లాంగ్‌వాల్ యంత్రాలను సమకూర్చుకుంటున్నది. దేశంలో మొట్టమొదటిసారిగా టు లెగ్‌డ్ చాక్ షీల్డ్ వినియోగిస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న వాటికంటే ఈ నూతన లాంగ్‌వాల్ యంత్రాల సామర్థ్యం నాలుగింతలు అనగా 1965 కె డబ్ల్యు సామర్థ్యం నుండి 7680 కె డబ్ల్యు (7.6 మె.వా.)కు పెరిగింది. ఈ యంత్రం అధునాతన సోఫిస్టికేటెడ్ కంట్రోల్ పరికరాలు కలిగివుంటుంది. ఈ యంత్రాన్ని అండర్ గ్రౌండ్ నుండి మాత్రమే కాకుండా భూ ఉపరితలం నుండి కూడా నేరుగా మానిటర్ చేయవచ్చు.

ఉద్యోగులను, యంత్రాలను భూ ఉపరితలంనుండి పని స్థలానికి చేరవేయడానికి డీజిల్ క్యారియర్స్‌ను ఉపయోగిస్తారు. వీటిని ఉపయోగించటం దేశంలోనే ప్రథమం. దీనివలన మెటీరియల్ సరఫరా త్వరితంగా జరిగి, యంత్రాల వినియోగం పూర్తిస్థాయిలో ఉంటుంది. ఈ ప్రాజెక్టుద్వారా లోతైన సీముల నుండి బొగ్గు తీయటం విజయవంతమైతే బొగ్గుకువున్న డిమాండును తీర్చడం తేలికవుతుంది.

11వ పంచవర్ష ప్రణాళికాంతానికి దేశంలో 620 మిలియన్ టన్నుల బొగ్గు అవసరమవుతుంది. ఇందులో దాదాపు 55 మిలియన్ టన్నులు దిగుమతి చేసుకోవాల్సిరావచ్చు. సరైన అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అండర్‌గ్రౌండ్ గనులనుండి బొగ్గు ఉత్పత్తిని పెంచకపోయినట్లయితే ఈ ప్రాంతంలో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేయటం కష్టమవుతుంది.

# సింగరేణిలో 'బూ' పద్ధతిలో కోల్‌వాషరీల ఏర్పాటు

**సింగరేణి యాజమాన్యం నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడానికి అనేక చర్యలు తీసుకుంటోంది. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గుకు ఒక ప్రత్యేక డిమాండు ఉంది. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించడం కోసం 'బూ' అనగా (బిల్డ్, ఓన్, ఆపరేట్) పద్ధతిలో కోల్‌వాషరీలను పలుచోట్ల ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం మణుగూరు, రామగుండంలలో వీటిని ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి మంచి ఫలితాలనిస్తున్నాయి. ఈ సందర్భంగా కోల్‌వాషరీలపై ఈ ప్రత్యేక వార్తను మీకు సమర్పిస్తున్నాం.**

సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గు వినియోగదారులకు అమ్మిన తరువాత ఇంకా కొంతమేర అన్ గ్రేడబుల్ కోల్ మిగిలి ఉంటుంది. దీనిని సాధారణంగా అలాగే వదిలివేయడం లేదా బయట పారబోయడం జరుగుతుంటుంది. ఎందుకంటే ఇందులో యాష్ క్వాంటిటీ 30% నుండి 60% వరకూ ఉంటుంది.

దీనిలో ఉన్న దుమ్ము, ధూళి, కణాలవల్ల పర్యావరణానికి ముప్పు ఉంది కాబట్టి 1997లో వచ్చిన పర్యావరణ చట్టం ప్రకారం 30% శాతం కంటె ఎక్కువ యాష్ క్వాంటిటి ఉన్న బొగ్గును రవాణా చేయుటకు నిషేధించబడింది. ఇటువంటి బొగ్గులో సాధారణంగా రాళ్ళు, షేల్ బొగ్గు, దుమ్ము, ధూళి ఉంటాయి.

అయితే ఇటువంటి బొగ్గును కోల్‌వాషరీల ద్వారా ప్రాసెస్ చేయడం ద్వారా కనీసం 'ఇ' గ్రేడ్ బొగ్గును మనం పొందే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని అవకాశాన్ని గుర్తించిన యాజమాన్యం 'బూ' విధానంలో కోల్‌వాషరీల ఏర్పాటుకు పూనుకుంది. దీనికోసం మన సంస్థ గ్లోబల్ వాషరీస్ సంస్థతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. గ్లోబల్ వాషరీ సంస్థ మణుగూరు ఏరియాలో ఒక ప్లాంటును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రక్రియలో ప్రధానంగా జీరో వ్యాల్యూతో కూడిన (అనగా ఎటువంటి గ్రేడు లేని) అన్‌గ్రేడబుల్ బొగ్గును వాషరీస్‌కు అందించినట్లైతే తిరిగి మనకు 41% వాష్ చేసిన 'ఇ' గ్రేడ్ బొగ్గు లభిస్తుంది.

**కోల్‌వాషింగ్ ప్రక్రియ**

అన్‌గ్రేడబుల్ కోల్ వాష్ చేసిన తరువాత ఇందులో రెండురకాల బొగ్గు వస్తుంది. 1. క్లీన్ కోల్, 2. రిజెక్ట్ కోల్.

**1. క్లీన్ కోల్ :** అన్‌గ్రేడబుల్ (పనికిరాని బొగ్గు, భూమిలో వృధాగా వదులుతున్న బొగ్గు) బొగ్గు వాష్ చేయడం ద్వారా 'ఇ' గ్రేడ్ బొగ్గు వస్తుంది. దీని ప్రస్తుత రేటు టన్ను ఒక్కింటికి రూ.1676.30 పైసలు ఒక టన్ను బొగ్గు వాష్ చేయటానికి రూ.170/-లు మాత్రమే మనం చెల్లిస్తున్నాము.

**2. రిజెక్ట్ కోల్ :** అన్‌గ్రేడబుల్ బొగ్గు వాష్ చేసిన తరువాత రిజెక్ట్ కోల్ వస్తుంది. మళ్లీ ఇందులో రెండు రకాలు :

ఎ. అమ్మకానికి ఉపయోగపడే బొగ్గు (షేల్ బొగ్గు), బి. అమ్మకానికి ఉపయోగం లేనిది (బండరాళ్ళు)





**ఎ. అమ్మకానికి ఉపయోగపడే బొగ్గు :** ఇటువంటి బొగ్గు సున్నం బట్టి, ఇటుక బట్టీల వారికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ బొగ్గును టన్ను ఒక్కింటికి రు.307/-లకు అమ్ముతున్నాం.

**బి. అమ్మకానికి ఉపయోగం కానిది :** ఇందులో కేవలం బండరాళ్ళు మాత్రమే ఉంటాయి. వీటిని బయటపడేస్తాం.

**కోల్ వాషరీ ప్లాంట్ నడిచే విధానం :**

ముందుగా అన్‌గ్రేడ్‌బుల్ బొగ్గును యార్డ్‌లో డంప్ చేస్తారు. ఈ బొగ్గును డోజర్‌తో ఎత్తి బంకర్‌లో వేస్తారు. ఈ బొగ్గు బెల్టు ద్వారా క్రషర్‌బంకర్ లోకి చేరుతుంది. రెండవదశలో ఈ బొగ్గు వాషింగ్ "జిగ్" లోకి బెల్టు ద్వారా పోతుంది. ఇక్కడ నీటితో బొగ్గును వాష్ చేయటం జరుగుతుంది.

కోల్‌వాషింగ్ జిగ్ నీటితో నిండి ఉంటుంది. అందులో బొగ్గు పడగానే క్రిందినుండి కంప్రెషర్ తీవ్రమైన ఒత్తిడితో నీటిని మరియు బొగ్గును పైకి ఎగదోస్తుంది. దీనివలన బొగ్గు కడగబడుతుంది. అదేవిధంగా తేలికగా ఉన్న బొగ్గు, నీటిద్వారా పైకి వచ్చి జల్లెడలాంటి బేసిన్‌లో పడుతుంది. తర్వాత అది వేరే బెల్టుద్వారా లోడింగ్ బంకర్‌లోకి చేరుతుంది. ఈ బొగ్గు క్లీన్ బొగ్గు లేదా 'ఇ' గ్రేడ్ బొగ్గుగా నిర్ధారించి అమ్మకానికి సిద్ధం చేస్తారు.

కాగా బరువుగల బొగ్గు మరియు రాళ్ళు కోల్ వాషింగ్ జిగ్ క్రింద భాగం ద్వారా బయటికి వచ్చి, బెల్టు ద్వారా రిజెక్ట్ కోల్ బంకర్‌లో పడతాయి.

అన్‌గ్రేడబుల్ బొగ్గు వాష్ చేసిన తరువాత వచ్చిన నీటిని పెద్ద హౌజ్‌లోనికి పంపించి గిలకకొడతారు. తరువాత బురదతో కూడిన నీటిని డ్రమ్ ఫిల్టర్‌లోకి పంపించడం జరుగుతుంది. ఈ డ్రమ్‌లోని ఫిల్టర్లు 500 పి.ఎస్.ఐ. స్పీడ్‌తో నీటిని లాగడంలో ఫిల్టర్లలోకి నీరు ఇంకి ఫిల్టర్లపై బురద మాత్రమే మిగులుతుంది. ఈ బురదను ప్రత్యేకమైన సాధనం ద్వారా వేరుచేయడం జరుగుతుంది. తర్వాత నీరు, బురదమట్టి వేరుకాబడి నీరు బయటికిపోతుంది. ఈవిధంగా కోల్‌వాషరీప్లాంట్ పని చేస్తోంది.

**సంస్థకు లాభదాయకమే:**



**"కోల్‌వాషరీలు అటు వినియోగదారులకి ఇటు మన సంస్థకి కూడా ప్రయోజనకరమైనవే. వృధాగా బయటపారేసే గ్రేడులేని బొగ్గునుంచి కనిష్ఠంగా 'ఇ' గ్రేడు బొగ్గును పొందగలుగుతున్నాం. ఇదొక లాభం. ఈ వాషరీలను మన కంపెనీ ఏర్పాటు చేయటం లేదు. బూ (బిల్డ్, ఓన్, ఆపరేట్) సిస్టమ్ ద్వారా ఈ వాషరీలు ఏర్పాటు చేస్తున్నాం. కేవలం వాషింగ్ చార్జీలు మాత్రమే మనం చెల్లిస్తున్నాం. మనం అమ్మే వాష్‌డ్ కోల్‌కు వాషింగ్ చార్జీలను, మరికొంత లాభాన్ని చేర్చి వినియోగదారులకు అమ్ముతున్నాం. కనుక మనకెటువంటి నష్టము లేదు. గతంలో బైటపడవేసే అన్‌గ్రేడ్ కోల్ వల్ల అక్రమాలు జరిగే అవకాశాలు ఈ కోల్‌వాషరీల వల్ల పూర్తిగా నిరోధించబడతాయి. త్వరలోనే ఆర్.కె.పి., ఖైరీగూడలో వీటిని ఏర్పాటు చేయనున్నాం. సత్తుపల్లిలో ఏర్పాటుచేసే విషయం పరిశీలనలో ఉంది."**

**– శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్)**

## రచయిత, శిల్పి - బొమ్మరాత ఎల్లయ్య



మణుగూరులోని ఏరియా వైద్యశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్న శ్రీ బొమ్మరాత ఎల్లయ్య తన బహుముఖ ప్రతిభతో అధికారుల, కార్మిక కుటుంబాల మన్ననలందుకుంటున్నాడు. చాక్‌పీసులతో ఆయన సృష్టించిన అద్భుత కళాఖండాలు, బుల్లిసీసాల్లో తాజ్‌మహల్, చార్మినార్ వంటి వాటిని బంధించిన దృశ్యాలు, ఆకులపై ఆయన గీసిన చిత్రాలు, ఇసుక, చీపురు పుల్లలతో తీర్చిదిద్దిన చిత్రాలు ఎవరి మనసునైనా ఇట్టే దోచేస్తాయి. ఇక గతంలో ఈయన ఎగ్జిబిషన్లు చూసిన ప్రస్తుత సింగరేణి డైరెక్టర్లు, సి.జి.ఎం.లు, జి.ఎం.లు మరియు కార్మికులు ఎల్లయ్యను అభినందించారు. చాక్‌పీస్‌తే ఆయన వందకు పైగా నమూనాలు తయారు చేయడం విశేషం.

**సింగరేణిపై గీతాలు... కవితలు... కథలు**

సింగరేణిపై ఆయన రచించిన అనేక గీతాలు కార్మికులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. తరచూ సింగరేణి యాజమాన్యం వెలువరించే మ్యాగజైన్లలో ఇతని పాటలను, కవితలకు ప్రత్యేక స్థానం కల్పిస్తారు. సంస్థ పురోభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, ఇతర సామాజిక బాధ్యతలను హృద్యంగా గుర్తుచేసే విధంగా ఎల్లయ్య రచనలుంటాయి. సింగరేణి సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వరుసగా మూడుసార్లు ప్రథమ బహుమతి పొందిన ఆయన రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీలోనూ బహుమతి సాధించాడు.

**ఆయన రచనలు :** యువ, మయూరి, ఆంధ్రభూమి, కార్మికలోకం, భావతరంగిణి పత్రికలలో కథలు ప్రచురించబడినవి. సంఘమిత్ర, సాహితీ ప్రస్థానం, ఈనాడు, వార్త సండే ఎడిషన్‌లలో, ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లలోనే కాక కవుల పక్షం, జీవన్మరణం, నాయిన, పరివ్యాప్త, భార్య కవితా సంకలనాల్లోను, భావతరంగిణి పత్రికలలో పలు కవితలు ప్రచురించబడినాయి. సింగరేణి మాగజైన్‌లో పలు గేయాలు, కవితలు, నినాదాలు, వ్యాసాలు ప్రచురించబడినాయి. వినూత్న ప్రక్రియ నానోలు (కవితలు) భావతరంగిణి, నేటినిజం, ప్రజాశక్తి, ప్రసారిక, సాహిత్య ప్రస్థానంలలో ప్రచురింపబడినాయి.

**బహుమతులు :** సింగరేణి ఇంధన పొదుపుపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో 1991, 1993, 1995 లలో వరుసగా ప్రథమ బహుమతులు మరికొన్ని ద్వితీయ బహుమతులను పొందారు. 2005లో సాహితీ స్రవంతి ఇల్లందు వారు నిర్వహించిన కథల పోటీలో ప్రథమ, కవితల పోటీలో ద్వితీయ బహుమతిని, మొమెంటోలను అందుకున్నారు. 'స్వాతి' పత్రిక వారు నిర్వహించిన కార్టూన్ల పోటీలో బహుమతి లభించింది. 'సాహితీ వేదిక' అనకాపల్లి వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్డు కవితల పోటీలలో ఇతని కవితకు తృతీయ బహుమతి, మొమెంటో, ప్రశంసాపత్రం లభించినది. 06.06.2006న సింగరేణి నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి 10.07.2007న సింగరేణి ఏరియా ఆసుపత్రి లెవెల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి, 30.06.2009న పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా ఏరియా ఆసుపత్రి నందు నిర్వహించిన పోటీలలో వక్తృత్వంలో ప్రథమ, వ్యాసరచనలో ద్వితీయ బహుమతి లభించినది.

**సన్మానాలు :** 'కళాలయ సాంస్కృతిక సంస్థ' పాలకొల్లు వారిచే 2007లో సన్మానం, 'గౌతవి నవ్యసాహితి' చర్ల వారిచే 27.12.2008న సన్మానం అందుకొన్నారు.

**ఆశయం :** కడవరకు సాహితీ వేత్తగా, సాహిత్యాభిమానిగా, కవిగా కొనసాగాలని...

**అభిమతం :** సామాజికంగా అణచబడినవారిలో కాస్తైనా చైతన్యం కలిగించే రచనలు చేయాలని...

## జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్ శ్రీ ఓరం సురేష్



సెక్యూరిటీ గార్డుగా రామగుండం-2 ఏరియాలో పని చేస్తున్న శ్రీ ఓరం సురేష్ ఇటీవల కోలిండియా ఇంటర్ కంపెనీ బాడీ బిల్డింగ్ పోటీలలో మిస్టర్ కోల్ ఇండియాగా ఎంపికవడం మనందరికి గర్వకారణం. గతంలో కూడా ఇతను 2002, 2003, 2005, 2006, 2007 ఐదు సంవత్సరములు కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో బంగారుపతకాలు సాధించాడు.

- 2004లో కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో రజత పతకం సాధించాడు.
- 2007 మరియు 2008లో రెండు సంవత్సరాలు మిస్టర్ సింగరేణి టైటిల్‌ను ఆర్.జి.-2 జి.ఎం. శ్రీ జి.రాజేందర్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నాడు.
- 2009లో మిస్టర్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను సాధించిన సింగరేణీయుడు.
- 2009 ముంబైలో జరిగిన జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని బెస్ట్ ఆఫ్ 15 సాధించి సింగరేణి పేరును జాతీయస్థాయిలో నిలిపాడు.

శ్రీ ఓరం సురేష్‌ను ఆర్.జి.-2 జి.ఎం. శ్రీ జి.రాజేందర్‌రెడ్డి మరియు ఎ.జి.ఎం. (పర్సనల్) శ్రీ రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ శ్రీ ప్రకాష్‌బాబు, కార్మికులు అభినందనలు తెలియజేసినారు.

## వన్యప్రాణుల సంరక్షణకు విస్తృత ప్రచారం చేస్తున్న ఉద్యోగి శ్రీ చంద్రశేఖర్



సింగరేణి సంస్థ చేపడుతున్న పర్యావరణ హితచర్యలు ఒక ఉద్యోగి జీవనశైలినే పూర్తిగా మార్చేసాయి. మణుగూరు ఓపెన్‌కాస్టుకు అనుబంధంగా గల కె.సి.హెచ్.పి.లో అసిస్టెంట్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీ జె.వి.ఎస్.చంద్ర శేఖర్ వన్యప్రాణుల సంరక్షణకు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపడుతూ ప్రజల్ని చైతన్యపరుస్తున్నాడు. ధరిత్రీ దినోత్సవం, హోలీ, శ్రీరామనవమి ఇలా ప్రతి సందర్భంలో స్వంత ఖర్చులతో కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంచుతుంటాడు. అన్ని కరపత్రాల సారం ఒక్కటే! **వన్యప్రాణులను చంపొద్దు. వాటికి ఆహారం, నీరు ఇవ్వాలి. జీవులను హింసించవద్దు. వ్యాధులు, గాయాలనుంచి కాపాడాలి.** ఇలా ఉంటాయి ఇతని నినాదాలు. మంచినీరు దొరకక చనిపోతున్న అటవీ జంతువుల దుస్థితిపై చలించి వాటికి అడవులలో మంచినీటి సౌకర్యం కలిగించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు లేఖ వ్రాసాడు. తన బర్త్‌డే సందర్భంగా న్యూస్‌పేపర్స్‌కిచ్చిన ప్రకటనలలో మూగజీవులను రక్షించండి అంటూ కోరడం అతని అంకితభావానికి నిదర్శనం. జనవరి నెలలో కొత్తగూడెం ఉమెన్స్ కాలేజీలో నిర్వహించిన జాతీయస్థాయి పర్యావరణ పరిరక్షణ సదస్సులో ఈయన ఒక ఆలోచనాత్మక వ్యాసాన్ని సమర్పించి ప్రశంసలందుకున్నాడు. ప్రతి నెలా జీతంనుంచి కొంత డబ్బును మూగజీవాల పరిరక్షణ ప్రచారానికి వెచ్చిస్తుంటానని, తనకు స్ఫూర్తి ఓ.సి.టు-2లో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలేనని శ్రీ చంద్రశేఖర్ చెప్తున్నాడు. డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. వంటి సంస్థలతో మూగప్రాణుల రక్షణకు తనవంతు కృషి చేస్తున్నానని, ఈ కృషిలో ఇతరులు భాగస్వాములు కావాలని కోరుతున్నట్లు వివరించాడు.

**- శ్రీ చంద్రశేఖర్, మణుగూరు. 9912425523**

# స్వయం ఉపాధికోసం చూస్తున్నారా?

## మీ కోసం ఎన్నో రకాల శిక్షణలు, రుణసౌకర్యాలు, మార్కెటింగ్ అవకాశాలు!

అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దొరకక పోవచ్చు. చదువున్నా అవకాశాలు రాకపోవచ్చు. కానీ ఏదైనా పనిచేసుకొని, స్వంతకాళ్లపై నిలబడదాం అనే ఆలోచన గలవారికి మాత్రం వందలాది అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. "ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల బోర్డు"వారి నిర్వహణలో దాదాపు 20 రకాల స్వయం ఉపాధి శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. సింగరేణి సేవాసమితి ద్వారా వీటిని అందించడానికి యాజమాన్యం విస్తృత స్థాయి చర్యలు చేపడుతోంది. శిక్షణ పొందినవారికి స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకోవడానికీ, రుణాలు పొందడానికీ, సబ్సిడీలు రాబట్టుకోవడానికీ తగిన సహకారం కూడా అందిస్తోంది. ఇటువంటి అవకాశాలగురించి సమగ్రమైన అవగాహన కల్పించడం కోసం ఈ ప్రత్యేక వార్తను సమర్పిస్తున్నాం.

**20 రకాల ఉచిత శిక్షణలు : ఎంపిక మీ ఇష్టం.**

ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల బోర్డు (హైదరాబాద్), రాజేంద్రనగర్‌లో గల తమ ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ ద్వారా 20 రకాల ఉచిత వృత్తి శిక్షణలు అందిస్తోంది. వీటిలో కొన్నింటికి ప్రభుత్వం నెలవారీ స్టైఫండ్ కూడా ఇస్తోంది. మరికొన్నింటికి నామ మాత్రం ఫీజు వసూలు చేస్తుంది.

**భోజనం, వసతి కల్పిస్తూ అందించే శిక్షణలు : స్టైఫండరీ శిక్షణలు :** 1. చేతి కాగితపు వస్తువుల తయారీ, 2. సబ్బుల తయారీ, 3. రెక్జిన్, లెదర్ వస్తువుల తయారీ, 4. అగర్‌బత్తీల తయారీ, 5. స్వీట్స్ తయారీ, 6. వడ్రంగం పని, 7. మసాల పొడుల తయారీ, 8. చాక్‌పీస్‌ల తయారీ.

**శిక్షణా కాలం :** శిక్షణనుబట్టి 1 నెల నుంచి 3 నెలలు ఉంటుంది.

**రానుపోను చార్జీలు కూడా :** ఎంపికైన అభ్యర్థులకు వారి ఊరినుంచి హైదరాబాద్‌కు రానుపోను రవాణాచార్జీలు కూడా ఇస్తారు.

**ఏం చదవాలి?** మామూలుగా చదవగలిగే సామర్థ్యం ఉండాలి. లేదా పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయినా ఫర్వాలేదు.

**వయస్సు :** 18 ఏళ్ళ నుండి 45 ఏళ్ళ వరకు.

**స్టైఫండ్ :** నెలకు 800 రూపాయల స్టైఫండ్ ఇస్తారు. హాస్టల్‌లో ఉచిత వసతి సౌకర్యం కల్గిస్తారు. స్టైఫండ్ సొమ్ముతో ఉచిత భోజన సౌకర్యం కల్గిస్తారు. ఒకవేళ హాస్టల్‌లో ఉండనివారికి రు.500/-లు స్టైఫండ్ చెల్లిస్తారు.

ఫీజు వసూలు చేసే శిక్షణలు : కొన్ని శిక్షణలకు మాత్రం నామ మాత్రపు ఫీజులను అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి శిక్షణలు చెల్లించాల్సిన ఫీజు వివరాలు ఇలా ఉన్నాయి.

| | శిక్షణ | శిక్షణాకాలం | ఫీజు |
|---|---|---|---|
| 1. | చాక్‌పీసులు మరియు కొవ్వొత్తుల తయారీ | 1 వారం | రు.200/- |
| 2. | విస్తరాకుల తయారీ | 1 వారం | రు.200/- |
| 3. | డిటర్జంటుపొడి తయారీ | 1 వారం | రు.200/- |
| 4. | డిటర్జంటుకేక్ తయారీ | 1 వారం | రు.200/- |
| 5. | బనియన్ల తయారీ | 2 నెలలు | రు.400/- |
| 6. | ఎరువుల తయారీ | 1 నెల | రు.200/- |
| 7. | ఫినాయిల్ తయారీ | 1 వారం | రు.200/- |
| 8. | అగరుబత్తీల తయారీ | 1 వారం | రు.200/- |
| 9. | పేపరు బ్యాగులు తయారీ | 1 వారం | రు.200/- |

సంప్రదించవలసిన ఫోన్ నం.: 9440814634/9440814635/9440814640.

### సింగరేణి సేవా సమితి ద్వారా ఉచిత శిక్షణలు

కాగా సింగరేణి సేవా సమితి ఖాదీ గ్రామోద్యోగ్ విద్యాలయ ద్వారా కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం అనేకానేక వృత్తి శిక్షణలు సింగరేణి ఏరియాల్లో ఉచితంగా అందిస్తున్నారు. ఇక్కడ ఇచ్చే శిక్షణలకు ఎటువంటి ఫీజు అభ్యర్థులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ మొత్తాన్ని సింగరేణి సేవా సమితి భరిస్తుంది. ఏఏ శిక్షణా కార్యక్రమాలు ఏఏ ఏరియాల్లో జరుగుతున్నాయో తెలుసుకొని ఆసక్తిగలవారు వీటిలో చేరవచ్చు.

**ఎవరిని సంప్రదించాలి?**

ప్రతీ ఏరియాలోని జి.ఎం. ఆఫీసులో పర్సనల్ డిపార్టుమెంటు ఉంటుంది. దీనిలో సింగరేణి సేవా సమితి కార్యక్రమాలు చూసే పర్సనల్ అధికారి ఉంటారు. అలాగే సేవా సమితి కో-ఆర్డినేటర్ కూడా ఉంటారు. వీరిని సంప్రదిస్తే తగిన సహాయం అందిస్తారు.

**శిక్షణ తర్వాత యూనిట్ స్థాపనకు సహాయం :** వృత్తి శిక్షణా కార్యక్రమం తర్వాత ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ వారు సంబంధిత యూనిట్ పెట్టుకోవడంలో ఎంతో సహకరిస్తారు. ఉదాహరణకి మీరు పేపర్ విస్తరాకుల తయారీ లేదా కొవ్వొత్తుల తయారీలో శిక్షణ పొందారనుకొందాం. శిక్షణ తర్వాత ఆ యూనిట్ పెట్టుకోవాలంటే ఏం చేయాలి? మెషినరీ ఎక్కడ దొరుకుతుంది? వాటి ఖరీదు ఎంత? కొనడానికి రుణాలు ఎవరు ఇస్తారు? దీంట్లో సబ్సిడీ ఎంత వస్తుంది? రుణాలు పొందటానికి ముందు అసలు ప్రాజెక్టు రిపోర్టు ఎలా తయారు చేయాలి. లాభనష్టాలు ఎలా బేరీజు వేయాలి? ఇటువంటి అనేక విషయాల్లో ఖాదీగ్రామోద్యోగ్ మహావిద్యాలయ సంస్థ అధికారులు మీకు ఆత్మీయుల్లా సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలను మన ఇంటి గడప వద్దనే తేవాలన్న ఉద్దేశంతో సింగరేణి సేవా సమితి వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 'ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం' పేరుతో ప్రతీ రీజియన్‌లోనూ శిక్షణ పొందినవారికి 2 రోజుల శిక్షణ ఇస్తున్నారు. వీటిలో పాల్గొంటే కలిగే ఆత్మవిశ్వాసం అంతా ఇంతా కాదు.

**రుణాలు ఎవరిస్తారు?**

స్వయం ఉపాధి పొందగోరుతున్న వారిని ఎక్కువగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వారు అనేకానేక పథకాలను ప్రవేశపెట్టింది. వీటిగురించి చెప్పేనాధుడు లేక చాలా పథకాలు అర్హులైన వారికి దక్కడం లేదు. ఇక్కడ కొన్ని రకాల పథకాలను ఉదహరిస్తున్నాం.

**1. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పి.ఎం.జి.ఇ.పి.) రుణం:**

1. సేవలకు సంబంధించిన యూనిట్‌కు రు.10 లక్షలు.
2. వస్తువులకు సంబంధించిన యూనిట్‌కు 25 లక్షల రుణం ఇస్తారు.

**సబ్సిడీ :** గ్రామీణ ప్రాంతాలలో ఎస్.సి., ఎస్.టి., బి.సి. కులాలవారు, మహిళలు, వికలాంగులు తదితరులకు తీసుకొనే రుణంలో 35 శాతం వరకూ సబ్సిడీనీ ప్రభుత్వం ఇస్తుంది. (అంటే లక్షకు 35 వేల వరకూ లబ్దిదారుడుకి ఉచిత పెట్టుబడి ప్రభుత్వం నుంచి లభిస్తుందన్న మాట). ఇతర కులాలు వర్గాలవారికి 25 శాతం సబ్సిడీ ఉంటుంది. పట్టణాలలో 15% నుంచి 25% వరకు సబ్సిడీ లభిస్తుంది.

**కనీస విద్యార్హత :** ఈ పథకం కింద రుణం పొందాలంటే కనీసం 8వ తరగతి పాసై ఉండాలి. అంతకంటే తక్కువ విద్యార్హత ఉన్నవారికి లోను తక్కువ మొత్తం వచ్చును.

**రుణాలు :** కావాల్సి ఉన్న మొత్తంలో లబ్దిదారుడు 10 శాతం పెట్టుబడి

పెట్టాల్సి ఉంటుంది. మిగిలింది బ్యాంకుల ద్వారా రుణంగా లభ్యమౌతుంది. **ఎంపిక :** ధరఖాస్తు చేసుకొన్న వారినుండి నిజంగా అర్హులైన వారిని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల కమిటీ ఎంపిక చేస్తుంది.

## సింగరేణి సంస్థ చేయూత

ఇటువంటి మంచి పథకం ద్వారా యువతీయువకులు స్వయం ఉపాధి సాధించేలా చూసేందుకు సింగరేణి సేవా సమితి ప్రతీ ఏరియాలోనూ దరఖాస్తులు స్వీకరించడం, జిల్లా కలెక్టరుకు పంపించడం, రుణాలు మంజూరయ్యేలా మార్గదర్శకత్వం జరపడం చేస్తోంది. మరిన్ని వివరాలకు అభ్యర్థులు ఏరియాలోగల సేవాసమితి కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ లేదా కో-ఆర్డినేటర్‌ను కలుసుకోవచ్చును. లేదా ఖాదీగ్రామోద్యోగ్ వెబ్‌సైట్, ఫోన్ 040-23397353, 040-24608463 ద్వారా లేదా అసిస్టెంట్ డైరెక్టర్ 9440814602 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

ఇవేకాక మండల పరిషత్తు కార్యాలయంలో విచారిస్తే బి.సి., ఎస్.సి., ఎస్.టి. కార్పోరేషన్ల ద్వారా వివిధరకాల సబ్సిడీ రుణాలు ప్రభుత్వం ఇప్పిస్తోంది. స్థానిక ఎం.పి.ఓ. ద్వారా దరఖాస్తు చేస్తే స్క్రీనింగ్ తర్వాత రుణాలు ఇప్పిస్తారు. అవకాశాలు అనేకం ఉంటాయి. ఏదైనా చేయాలి, సాధించాలి. నా కాళ్లపై నేను నిలబడాలి అనే పట్టుదల ఉంటే ఎవరికైనా సరే అనేక స్వయం ఉపాధి మార్గాలు స్వాగతం పలుకుతుంటాయని గమనించాల్సి ఉంది.

## సేవా సమితి ఉత్పత్తిదారులకు మార్కెటింగ్ కోసం హైదరాబాద్‌లో ఒక షాపు ప్రారంభం

సింగరేణి సేవా సమితి ద్వారా వివిధ వృత్తుల్లో శిక్షణ పొంది స్వంత యూనిట్లు పెట్టుకొన్న మహిళలు కొందరు సొంతగా వస్తువుల్ని ఉత్పత్తి చేస్తున్నారు. వీరికి మార్కెటింగ్ అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సింగరేణి సంస్థ హైదరాబాద్‌లో ఒక రిటైల్ మరియూ హోల్‌సేల్ అమ్మకపు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మాసాబ్‌ట్యాంక్‌లోగల ఖాదీగ్రామోద్యోగ్ భవనంలో ఈ స్టాల్‌ను నెలకొల్పింది. దీనిని మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు ఫిబ్రవరి 19వ తేదీన ప్రారంభించారు. కార్యక్రమంలో మన డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (పా) శ్రీ కె.వి.రమణ, జి.ఎం. కో-ఆర్డినేషన్ శ్రీ ఎస్.చంద్రశేఖర్, ఎ.పి. ఖాదీగ్రామోద్యోగ్ బోర్డు సి.ఇ.,ఒ. శ్రీ ఎం.వి.సత్యన్నారాయణ, కె.వి.ఐ.సి. డైరెక్టర్ శ్రీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ స్టాల్‌లో వివిధ ఏరియాలవారు తమ వస్తువులను అమ్మకాలకు ఉంచారు. ఈ అవకాశాన్ని అన్ని ఏరియాలవారు వినియోగించుకోవాలని సేవా సమితి కోరుతోంది. ఈ స్టాల్ డ్వాక్రా గ్రూపులద్వారా నిర్వహించబడుతుంది. సింగరేణి ప్రాంతంలో స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా వస్తువులను ఉత్పత్తి చేస్తున్నవారు ఈ స్టాల్‌లో తమ వస్తువులను అమ్ముకోవడానికి, ఇతర సమాచారానికి శ్రీ శివ కుమార్, కో-ఆర్డినేటర్‌ను 9440484894 ద్వారా సంప్రదించవచ్చును.





## కొత్తగూడెంలో సెల్ ఫోన్ రిపేరు శిక్షణ కార్యక్రమం

సింగరేణి సేవా సమితి, కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 3 నెలల 'సెల్ ఫోన్ రిపేర్' వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి సోనియా విజయారావు ఇటీవల ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సెల్‌ఫోన్ రిపేర్' వృత్తి విద్యా శిక్షణను ఆసక్తితో మరియు రెగ్యులర్‌గా నేర్చుకొని తర్ఫీదు పొందాలని కోరారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి జీవితంలో, సెల్‌ఫోన్‌ను ఉపయోగించడం జరుగుతుందని, సెల్‌ఫోన్ తరచుగా రిపేర్, కొన్ని పరికరాలు పోవడం జరుగుతుంది. కాబట్టి ఈ శిక్షణను నేర్చుకుని లబ్దిపొంది తద్వారా ఒక వృత్తిని సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పొంది వారి వారి కుటుంబములకు సహాయపడాలని కోరారు. డిప్యూటి జి.ఎం. (పర్సనల్) శ్రీ హరిగోపాల్, మరియు గుర్తింపు సంఘం నాయకులు శ్రీ మాటెటి గోపాలు ఈ కార్యక్రమంలో మాట్లాడుతు ఇలాంటి వృత్తి విద్యా కోర్సులను యువకులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 25 మంది యువకులకు శిక్షణ ఇవ్వబడుతుంది.

### కొనసాగుతున్న మహిళా సాక్షరతా కార్యక్రమం



కొత్తగూడెం ఏరియాలో మహిళా సాక్షరతా కార్యక్రమాన్ని ఉధృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాలోని రామవరం, రుద్రంపూర్, ఇతర కాలనీలలో మహిళల కోసం ప్రత్యేక అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. సాక్షరతా కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఏరియా జి.ఎం. శ్రీ సి.హెచ్.విజయరావు, సేవా అధ్యక్షురాలు శ్రీమతి సోనియా విజయరావులు పాల్గొన్నారు.



# ఇంటర్ ఏరియా మైన్స్ రెస్క్యూ పోటీలు




## ఓవరాల్ ప్రథమ-శ్రీరాంపూర్



రామగుండం-2 ఏరియాలో గల మైన్స్ రెస్క్యూ స్టేషనులో జనవరి 27, 28వ తేదీల్లో ఇంటర్ ఏరియా మైన్స్ రెస్క్యూ టీముల మధ్య పోటీలు నిర్వహించారు. మొత్తం 7 జట్లు దీనిలో పాల్గొన్నాయి. 8 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఓవరాల్ ప్రథమస్థానాన్ని శ్రీరాంపూర్ ఏరియా, ద్వితీయస్థానాన్ని భూపాలపల్లి, తృతీయస్థానాన్ని రామగుండం-1 గెలుచుకొన్నాయి. విజేతలకు ముఖ్యాతిథులు శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్), శ్రీ సతీష్ పురీ, డి.వై.డి.జి.ఎం.ఎస్.లు బహుమతులు అందజేసి రెస్క్యూ టీముల కర్తవ్యాలను ప్రభోదించారు. ఏరియా జి.ఎం. శ్రీ జి.రాజేందర్ రెడ్డి సారథ్యంలో పోటీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సి.జి.ఎం. సేఫ్టీ శ్రీ సి.హెచ్.కృష్ణయ్య, శ్రీ ఎస్.మోహనరావు, జి.ఎం., ఎస్.ఓ.టు డైరెక్టర్ (పి.అండ్‌పి.), డి.ఎం.ఎస్‌లు,శ్రీ పి.రంగనాధీశ్వర్, శ్రీ ఎస్.కృష్ణమూర్తి,గుర్తింపు కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ వై.గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.






# ఉల్లాసభరితంగా 'సింగర్ ఆఫ్ సింగరేణి' కార్యక్రమం



సింగరేణి ఉద్యోగులు, కుటుంబీకులలో గల గాయనీ గాయకులను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన **"సింగర్ ఆఫ్ సింగరేణి"** కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. తొలుత ఏరియా, రీజియన్ స్థాయిల్లో పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌ను కార్పోరేట్ కొత్తగూడెంలో డిసెంబర్ 6, 13వ తేదీల్లో నిర్వహించారు. ఫైనల్స్ పోటీల్లో మొత్తం 15 మంది పాల్గొని పలురకాల ఆసక్తికరమైన రౌండ్సులో పోటాపోటీగా తమ ప్రతిభ కనపరిచి అందరినీ అలరించారు. ఫైనల్స్ పోటీలకు ముఖ్యఅతిథిగా మన ఛైర్మన్ గారి సతీమణి శ్రీమతి వినత నర్సింగ్‌రావు, సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు, సి.జి.ఎం. పర్సనల్ శ్రీ ఎం. గంగిరెడ్డి, జి.ఎం.(కోఆర్డినేషన్) శ్రీ ఎస్. చంద్రశేఖర్ పాల్గొన్నారు. డి.జి.ఎం. (వెల్ఫేర్) శ్రీ ఎల్.వి.ఎన్.శర్మ, శ్రీ మల్లయ్య పంతులు పోటీలను పర్యవేక్షించారు. కార్మిక సంఘాల నాయకులు శ్రీ కె.డబ్ల్యు. క్రిష్టఫర్, శ్రీ జి.కె.సంపత్ కుమార్‌లు పాల్గొన్నారు. శ్రీ గణాశంకర్ పూజారి యాంకర్‌గా వ్యవహరించారు. ఈ పోటీలను 'మన టీ.వీ.' ద్వారా ప్రసారం చేయడం జరిగింది.





# భూపాలపల్లిలో కార్మికుల స్వంత ఇంటి పథకం

**సింగరేణి దినోత్సవం నాడు (డిసెంబర్ 23 2009) భూపాలపల్లి ఏరియాలో కార్మికుల స్వంత ఇంటి పథకాన్ని మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్. నర్సింగ్ రావు ప్రారంభించారు.**







కంపెనీ క్వార్టరు లేని కార్మికులకు సీనియారిటీ ప్రకారం ఒక్కొక్కరికి 200 చదరపు గజాల స్థలాన్ని ఈ పథకం ద్వారా కేటాయిస్తున్నారు. తొలిదశలో 1,048 మంది కార్మికులకు అందజేయనున్నారు. గణపూర్ మండలం చెల్పూరు గ్రామమువద్ద సేకరించిన 107 ఎకరాల విస్తీర్ణంగల ఈ స్థలంలో కంపెనీ రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు, పార్కులు వంటి కనీస వసతి సౌకర్యాలను కలగజేస్తోంది. సగటున దీనికోసం ఒక్కొక్క ప్లాట్ పేరిట 50 వేల రూపాయల వరకు కంపెనీ ఖర్చు చేయనుంది. ఇంకా కార్యక్రమంలో ములుగు సబ్ కలెక్టర్ శ్రీ జి.సువర్ణపాండా దాస్, ఐ.ఏ.ఎస్., గుర్తింపు కార్మికసంఘం జనరల్ సెక్రటరీ శ్రీ వి. సీతారామయ్య, మన డైరెక్టర్లు శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్), శ్రీ ఇ.వి. కృష్ణారెడ్డి, డైరెక్టర్ (ఫైనాన్స్), శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్, డైరెక్టర్ (పి అండ్ పి), ఏరియా జి.ఎం. శ్రీ బి.కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కె.టి.కె.-6, జి.డి.కె.-10ఎ గనుల్లో మ్యాన్ రైడింగ్ సిస్టంల ప్రారంభం



కార్మికుల సౌకర్యార్థం యాజమాన్యం భూపాలపల్లి ఏరియాలో గల కె.టి.కె.-6 ఇంక్లైన్‌లో రూ.130 లక్షల వ్యయంతో మ్యాన్ రైడింగ్ సిస్టంను నెలకొల్పగా, మన ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు సింగరేణి దినోత్సవం నాడు ప్రారంభించారు. దీనివలన గని లోపల కిలోమీటర్ దూరం నడిచే శ్రమ తగ్గిపోతుంది. సెట్ రైడింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించడానికి, కార్మికులకు సౌకర్యం, రక్షణ కలిగించడానికి సింగరేణి యాజమాన్యం అన్ని గనుల్లోనూ మ్యాన్ రైడింగ్ సిస్టంలను నెలకొల్పుతోందనీ, ఇప్పటికి 29 గనుల్లో 35 మ్యాన్ రైడింగ్ సిస్టంలు నెలకొల్పిందని, మరో రెండు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. మాన్ రైడింగ్ ఏర్పాటుపై కార్మికులు హర్షం ప్రకటించారు.

**జిడికె-10ఎ గనిలో**

రామగుండం-3 ఏరియాలో గల జిడికె-10ఎ గనిలో కొత్తగా ఏర్పాటు చేసిన మ్యాన్‌రైడింగ్ సిస్టంను జనవరి 11వ తేదీన డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి. దత్తాత్రేయులు ప్రారంభించారు. దీనివల్ల 1400 మీటర్ల దూరం చైర్‌లిఫ్ట్ సిస్టం ద్వారా కార్మికులు ప్రయాణించే వీలు కలుగుతుంది. కార్మికుల సౌకర్యార్థం మరియు రక్షణ కోసం కంపెనీ ఎంత ఖర్చుకైనా వెనుకాడకుండా చర్యలు చేపడుతుందని డైరెక్టర్ (ఆపరేషన్స్) అన్నారు. కార్యక్రమంలో ఆర్.జి. - 3 జనరల్ మేనేజర్ శ్రీ సి.హెచ్.నరసింహారావు, తెలంగాణా బొగ్గు గని కార్మికసంఘం నాయకులు శ్రీ కె. మల్లయ్య, ఎ.ఐ.టి.యు.సి. నాయకులు శ్రీ వై.వి.రావు, ఏజెంట్ శ్రీ రమేష్‌రావు, మేనేజర్ శ్రీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునీకరించిన సింగరేణి మహిళా కళాశాల ఆడిటోరియం ప్రారంభం





కొత్తగూడెంలో సింగరేణి మహిళా కళాశాలలో గల ఇండోర్ ఆడిటోరియమ్‌ను సకల ఆధునిక సౌకర్యాలతోపాటు సెంట్రల్లీ ఎయిర్‌కండీషన్డ్ ఆడిటోరియంగా రూపుదిద్దారు. దీనిని మన డైరెక్టర్ (పా) శ్రీ కె.వి.రమణ, ఐ.ఏ.ఎస్. జనవరి 18వ తేదీన ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డైరెక్టర్ పి అండ్ పి శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్, సి.జి.ఎం. (కార్పొరేట్ ప్రాజెక్ట్సు అండ్ ప్లానింగ్) శ్రీ బి.రమేష్‌కుమార్, సి.జి.ఎం. హెచ్.ఆర్.డి. శ్రీ కె.జె.అమరనాథ్, జి.ఎం. సివిల్ శ్రీ రాం భద్రిరాజు, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శ్రీ జయకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆడిటోరియంలో కళాశాల కార్యక్రమాలతో పాటు సంస్థకు సంబంధించిన సదస్సులు, సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా ఉంటుంది. ప్రారంభోత్సవం సందర్భంగా డైరెక్టర్ పి అండ్ పి శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్ నెలవారీ 'నాలెడ్జ్ డే' కార్యక్రమంలో భాగంగా "ఇండియా-2020" అనే ప్రజెంటేషన్‌ను సమర్పించారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు





సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో 61వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన సెంట్రల్ ఫంక్షన్‌లో ముఖ్యాతిథిగా పాల్గొన్న సంస్థ ఛైర్మన్ అండ్ ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. మణుగూరు, కొత్తగూడెం, ఇల్లందు ఏరియాల నుంచి ఎంపిక చేయబడిన ఉత్తమ కార్మికుల్ని, సింగరేణి వ్యాప్తంగా ఎంపిక చేయబడిన 11 మంది ఉత్తమ అధికారుల్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ అండ్ పి.సి., ఎన్.సి.సి., స్థానిక పాఠశాలలవారు జరిపిన మార్చ్‌ఫాస్ట్ కవాతు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మన డైరెక్టర్లందరితోపాటు గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, కార్మికులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు. ఆనాటి కార్యక్రమాల్లో పాల్గొన్న పాఠశాలల వారికి శ్రీమతి వినత నర్సింగ్‌రావు మెమొంటోలను బహూకరించారు. హెడ్డాఫీసులో మన డైరెక్టర్ (పా) శ్రీ కె.వి.రమణ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో కూడా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏరియా ఉన్నతాధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఉత్తమ ఉద్యోగుల్ని సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో స్థానిక పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఉత్తేజపరిచాయి.



## "దేశ బొగ్గు అవసరాలు తీర్చడంలో మనం ముందుండాలి"

"దేశ బొగ్గు అవసరాలు తీర్చడంలో మన సింగరేణి సంస్థ తనవంతు బాధ్యతను సమర్థంగా నిర్వహించనుంది. దీనికోసం రాబోయే 5 సంవత్సరాలలో 260 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం గల 15 గనులను ప్రారంభించుకోనున్నాం. లక్ష్యాలు సాధించడంలో ఎప్పుడూ ముందుందాం.

– శ్రీ ఎస్.నర్సింగ్‌రావు, ఛైర్మన్ అండ్ ఎం.డి.



# సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోనూ గణతంత్ర వేడుకలు

















# బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు



26వ శ్రీ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ జనవరి 16,17-2010 రెండు రోజులు బెల్లంపల్లి తిలక్ స్టేడియం వర్ధ్ పీపుల్స్ స్పోర్ట్స్ & గేమ్స్ అసోసియేషన్ బెల్లంపల్లి ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించబడ్డాయి.

ఈ పోటీల ప్రారంభ మరియు ముగింపు/ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాలను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ సి.వి.రెడ్డిగారు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ క్రీడల అభివృద్ధికి సదా ప్రోత్సాహం అందిస్తూనే ఉంటుందని అన్నారు. ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలలనుండి 12 జట్లు పాల్గొనగా రామగుండం స్పోర్టింగ్ క్లబ్ విజేతగా నిలువగా రెండవస్థానంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటి, ఆదిలాబాదు జట్టు నిలిచింది.

ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్రీ ఎ.ఆనందరావు, సి.ఎం.ఒ.ఎ.ఐ. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, కార్మిక సంఘ నేతలు శ్రీ చిప్పనర్సయ్య, శ్రీ కడియాల నర్సయ్య, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ మరియు హానరరి సెక్రటరి శ్రీ ఎం.రాజేంద్రకుమార్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీ హెచ్.రమేష్, డబ్ల్యు.పి.ఎస్. కో-ఆర్డినేటర్ శ్రీ ఎం.డి.నూరుద్దీన్, సీనియర్ క్రీడాకారులు, పట్టణ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని ఈ టోర్నమెంటును విజయవంతం చేసారు.

# సింగరేణి కాలనీలలో 'స్వైన్ ఫ్లూ' అవగాహన కార్యక్రమాలు

మణుగూరు ఏరియా సింగరేణి కాలనీలలో 'స్వైన్ ఫ్లూ' వ్యాధి పట్ల సింగరేణీయులకు మరియు వారి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించుటకు సింగరేణి యాజమాన్యం స్వైన్‌ఫ్లూ పై అవగాహన కార్యక్రమాలకు ది.05.10.2009న కూనవరం కాలనీ నుండి శ్రీకారం చుట్టింది. సింగరేణి సేవా సమితి మరియు సేవా ఆధ్వర్యంలోని సేవా సభ్యుల బృందం కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ స్వైన్‌ఫ్లూ పై అవగాహన కల్పిస్తు న్నారు. వ్యాధి వ్యాప్తికి గల కారణాలను వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపే కరపత్రాలను ఇంటింటికి అందచేశారు. పి.వి. కాలనీ, కూనవరం కాలనీ, పైలట్ కాలనీలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్రీ హైదర్ అలీ, సేవా సభ్యులు సర్వ శ్రీమతి/శ్రీ జాబ్ జానీ, జయశ్రీ లక్ష్మిగణేశ్వరీ, శాకీరా, సుల్తానా, సంధ్య, శారద, డి.లక్ష్మి, జమీల, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## • సింగరేణికి వందనం •



నల్ల బంగారమై నలుదిశలను సాగి
కార్మిక లోకాన్ని కాచినావు
కార్మిక పిల్లల్ని కనుపాపగా నెంచి
విద్యనొసంగిన వేల్పు నీవు
అమ్మలా కాపాడు ఆసుపత్రుల నిచ్చి
ఆరోగ్య సూత్రమై అమరినావు
వాడవాడలయందు పరిశుభ్రతను పెంచి
పసిడి కలలదారి పరచినావు

1. విశ్వకీర్తి బడయ విద్యుత్తు వైనావు
ఫ్యాక్టరి గళమందు పలికినావు
శతనమస్సులమ్మ శక్తిస్వరూపిణి
సిరులొసంగుతల్లి సింగరేణి –

2. భూఉపరితల భూగర్భ పుణ్యగనులు
కార్మికోన్నతి కాంక్షించి కాన్కలొసగె
వివిధ ప్రాంతాల యోగమై విస్తరించి
అంగరంగ వైభవమొందె సింగరేణి –

3. పనులను జేసెడు వేళల
కనికరమున కావుమంచు కార్మికులెల్లన్
గని దేవత మైసమ్మకు
వినయంగా చేతులెత్తి ప్రియమున కొలిచెను.

4. గృహిణులకొక మంచి స్నేహ హస్తముసాచి
సేవ సమితి పేర సేదదీర్చె
పేద గొప్ప యనక వేదనల్ పరిమార్చి
ఆర్థికముగ నిల్చి ఆదుకొనియె.

5. పొదుపు తోడ ధనము నదుపులో పెట్టుచూ
ఆలుబిడ్డలందు హాయినింపె
సత్యధర్మనీతి సహవాసమొందించి
బ్రతుకు బాటలోన వెతలు దీర్చె.

6. ఒకటే లక్ష్యము గమ్యము
ఒకటే ఇక మన కుటుంబ ఉద్దేశ్యమవన్
ఒకటై కార్మికులంతా
ఒకటవ కంపెని యటంచు ఉర్విని చాటెన్.

7. కళలకు నెలవైన కార్మిక వాడకున్
కదలివచ్చి నిలిచె గౌతమిటకు
తల్లి సింగరేణి తనువును సృజియింప
వెలుగులమ్మ బుద్ధి బలమునొసగె.

**– రాకుమార.**
స్కూల్ అసిస్టెంట్, సింగరేణి కాలరీస్ హైస్కూల్,
రామగుండం-2.

## వృక్ష నివేదన



మీ పసిపాపను సాకినట్లు సాకమని
లేనిపోని ఆంక్షలు విధించడంలేదు.
పంచ భక్ష్య పరమాన్నాలు కావాలని
గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు.
దినచర్యలో భాగంగా మీరు వాడేసిన నీటిని
దయచేసి మావైపు పారనీయండి.
మీ వంటగదిలో చెరిగేసిన, కడిగేసిన, తరిగేసిన వ్యర్థాలను
మాకు ఆహార పదార్థంగా ప్రసాదించండి.
తత్ఫలితంగా మీకెన్నెన్నో ప్రయోజనాలు
మరింత పుష్కలంగా మా వలన మీరు లబ్ది పొందాలంటే,
విస్తృతంగా మీ స్థలాల్లో మాకు స్థానం కల్పించి
కంటికి రెప్పలా మమ్ము కాపాడుకుంటే –
పసిపాపల కేరింతలతో, పక్షుల కిలకిల రావాలతో,
చెంచెంగున ఎగిరి దూకే లేగ దూడల, లేడి కూనల సందళ్ళతో
కళకళలాడే మీ జీవకోటి సమస్తాన్ని
పొత్తిళ్ళలో బిడ్డలా కాపాడుకుంటాం.
భూలోక కల్పవృక్షాలనే నానుడిని నిలబెట్టుకుంటాం.

**– యార్లగడ్డ గురునాథరావు,**
క్లర్క్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, కార్పోరేట్.

# సింగరేణి కాలరీస్ మహిళా జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల వార్షికోత్సవాలు



సింగరేణి కాలరీస్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల క్రీడాదినోత్సవం జనవరి 22న సాయంత్రం మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) మరియు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ జె.వి.దత్తాత్రేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తి ఆరోగ్యానికి వికాసానికే కాక, సమాజానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఆలోచనలు, చర్యలు సైతం పాజిటివ్‌గానే ఉంటాయని అన్నారు. వివిధ బలహీనతల మూలంగా అనేకమంది విద్యార్థినులు చిన్నచిన్న సమస్యలకే ఆత్మహత్యలకు పాల్పడటం విచారించదగ్గ విషయమని, తగిన ఆత్మ స్థైర్యం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. ఆత్మస్థైర్యం పెంపొందేందుకై క్రీడలు అత్యంత అవసరమని అన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ జనరల్ మేనేజర్ (పర్సనల్) శ్రీ సి.సింహాచలం మాట్లాడుతూ సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినులు జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలోనే కాక జాతీయస్థాయిలో కూడా అనేక క్రీడా పోటీలలో పాల్గొని అనేక పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా మహిళా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీమతి కె.సావిత్రి కళాశాల క్రీడల నివేదికను సభకు సమర్పించారు. అనంతరం ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు సింగరేణి ఎంప్లాయీస్ వైవ్స్ అసోసియేషన్, (సేవా) అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు, శ్రీమతి ప్రియంవద జయకర్ బహుమతి ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జి.లక్ష్మీకుమారి, మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి డి.స్వర్ణ, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మరియు డి.వై.జి.ఎం. (పర్సనల్) శ్రీ సి.హెచ్.జయకర్ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



సింగరేణి కాలరీస్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల 36వ వార్షికోత్సవం ఫిబ్రవరి 23న సాయంత్రం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్–ప్రాజెక్ట్స్) మరియు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ డి.ఎల్. ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలోని ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకై కొత్తగూడెం లాంటి చిన్న పట్టణంలో యూనివర్సిటీ స్థాయిలో మహిళా కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కళాశాలలో అన్ని వసతులున్నాయని, ఇంకా కొత్తగూడెం చుట్టపక్కల గ్రామాలలోని గిరిజన మరియు నిరుపేద యువతులకు ఈ కళాశాలలో విద్యనభ్యసించేందుకై అవకాశమున్నదని అన్నారు. విద్యనభ్యసించడం కేవలం ఉద్యోగాలను పొందడానికే కాదని, మానవ సామర్థ్యం పెంపొందించుకునేందుకు, పేదరిక నిర్మూలన, అసమానతలను రూపొందించేందుకై కృషి చేయాల్సి ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమానికి డి.వై.జి.ఎం. (పర్సనల్) మరియు సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శ్రీ సి.హెచ్.జయకర్ అధ్యక్షత వహించారు. ముందుగా మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి డి.స్వర్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జి.లక్ష్మీకుమారి, కళాశాలల నివేదికను సభకు సమర్పించారు.

అనంతరం ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ముఖ్యఅతిథి మరియు డైరెక్టర్ (ప్లానింగ్–ప్రాజెక్ట్స్) శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్ మరియు శ్రీమతి ప్రియంవద జయకర్‌లు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



# కోల్ ఇండియా పోటీలలో పాల్గొనేందుకై కంపెనీస్థాయి సాంస్కృతిక పోటీలు

సింగరేణి సంస్థ కళలకు, క్రీడలకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెల్సినదే. ఇందులో భాగంగా కంపెనీస్థాయిలో వివిధ సాంస్కృతిక విభాగాలలో పోటీలు స్థానిక సి.ఇ.ఆర్.క్లబ్‌నందు ఫిబ్రవరి 20, 21 తేదీలలో నిర్వహింపబడ్డాయి. ది.20.02.2010న ఉదయం గం॥10:00లకు ఈ పోటీలు ప్రారంభింపబడ్డాయి. 21.02.2010 సాయంత్రం గం॥6:00లకు జరిగిన ముగింపు వేడుకలకు జనరల్ మేనేజర్ (పర్సనల్) శ్రీ సి.సింహాచలం ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతి ప్రదానం గావించారు. 20వ తేదీన వ్యక్తిగత విభాగాలైన భజన్, లైట్‌సాంగ్, గీత్, కీర్తన, గజల్, కర్నాటక సంగీతం, ఫ్లూట్, తబల, కీబోర్డ్, బ్యాంజో మరియు గిటార్‌లతో అలాగే 21.02.2010న ఉదయం గం॥10:00ల నుండి గం॥1:00 వరకు ఫోక్‌సాంగ్, భరతనాట్యం, కూచిపూడి, హాస్యగీతిక విభాగాలలో, మధ్యాహ్నం గం॥3:00ల నుండి సా॥ గం॥6:00ల వరకు ఫోక్‌డ్యాన్స్, ఖవ్వాలి, ఆర్కెస్ట్రా బృందవిభాగాలలో ఈ పోటీలు నిర్వహింపబడ్డాయి. మొత్తం పై అన్ని విభాగాలలో కొత్తగూడెం, రామగుండం మరియు బెల్లంపల్లి రీజియన్లకు చెందిన సుమారు 120 మంది కళాకారులు పాల్గొన్నారు. కంపెనీ స్థాయిలో ఎంపికైన కళాకారులు కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి ప్రతిష్ఠను ఇనుమడింపజేసి అనేక పతకాలు సాధిస్తారని ఆశిద్దాం! ఈ పోటీలు కార్పొరేట్ ఏరియా "వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ & గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహింపబడ్డాయి.



డిసెంబర్ 30న కొత్తగూడెం ఏరియా పెనగడపలో నిరుద్యోగ యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న జి.ఎం. శ్రీ సి.హెచ్.విజయారావు.



తమ శిక్షణలో భాగంగా కొత్తగూడెం ఏరియాలో డిసెంబర్ 26న జి.కె. ఓ.సి. గనిని సందర్శించిన ఐ.ఎ.ఎస్. ట్రైనీలు.



ఇల్లందు ఏరియా పరిధిలో ఎర్రాయిగూడెం గ్రామంలో మార్చి 24న కంపెనీ నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో వైద్యసేవలు పొందుతున్న గ్రామస్థులు.



బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓ.సి. గని భూ నిర్వాసితులకు ఆర్ & ఆర్ ప్యాకేజీ కింద ఫిబ్రవరి 20న చెక్కులను అందచేస్తున్న జి.ఎం. శ్రీ సి.వి.రెడ్డి.



ఫిబ్రవరి 15న మణుగూరులో జరిగిన కంపెనీస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎస్వో టు జి.ఎం. శ్రీ ఎం.ఎస్. వెంకట్రామయ్య.



రామగుండం-2 ఏరియాలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నాడు వికలాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం.



శ్రీరాంపూర్ లో పిల్లల చదువు తలిదండ్రుల బాధ్యతపై ఫిబ్రవరి 3న జరిగిన చర్చా వేదిక కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు, పిల్లలు, వేదికపై డాక్టర్ చిరంజీవి, డివై.సి.ఎం.ఒ. పర్సనల్ మేనేజర్ శ్రీ బి.వి.వి.ఎస్.ఎస్.ఎస్.శర్మ, హెడ్‌మాస్టార్ శ్రీ పాండురంగారావు.



ఇల్లందు ఏరియాలో వివిధ గనులు, పాఠశాలల్లో యోగాచార్య శ్రీ సురేశ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులను డిసెంబర్, జనవరి నెలల్లో నిర్వహించడం జరిగింది. శిక్షణా కార్యక్రమం దృశ్యం.

# రామగుండం-3 పరిధిలోని రామయ్యపల్లిలో ఉచిత వైద్యసేవలు



రామగుండం-3 ఏరియా పరిధిలోగల రామయ్యపల్లి గ్రామంలో సింగరేణి వైద్య విభాగం ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ క్యాంపును ఫిబ్రవరి 21వ తేదీన నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్.జి.-3 ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ సి.హెచ్.నర్సింహారావు గ్రామస్థులతో మాట్లాడుతూ సింగరేణి సంస్థ సమీప గ్రామాల ప్రజలకోసం తనవంతుగా చేపడుతున్న పలురకాల కార్యక్రమాలు వివరించారు. మెడికల్ క్యాంపులో మొత్తం 101



మంది వైద్య సేవలు, మందులు పొందారు. డా॥ జానకి సారథ్యంలో వైద్యబృదం సేవలందించింది. గ్రామసర్పంచి శ్రీ ఎస్.రవీందర్, వార్డు మెంటర్లు క్యాంపు నిర్వహణపై హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఓ.సి.పి.-1 పి.ఓ. శ్రీ ఎ.విజయపాల్‌రెడ్డి, ఎ.జి.ఎం. (ఇ అండ్ ఎం) శ్రీ పి. ప్రతాప్‌కుమార్, ఎస్వో టు జి.ఎం. శ్రీ జె.వి.ఎల్.గణపతి, ఎస్టేట్స్ ఆఫీసర్ శ్రీ ఇ.విజయ్‌కుమార్, పర్సనల్ మేనేజర్ శ్రీ వై.రామ్మోహనరావు సేవా సభ్యులు తదదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రభావిత గ్రామాల్లో కంపెనీ సేవలపై సర్పంచ్ స్పందన

సింగరేణి ప్రభావిత గ్రామాలలో సింగరేణి సంస్థ రామగుండం-2 ఏరియా/ సింగరేణి సేవా సమితి వారు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించి మాయొక్క గ్రామములోని వివిధ రకాల వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి హైదరాబాద్‌లోని కార్పోరేటు హాస్పిటల్స్‌లో వైద్యం చేయించి మంచి మందులు ఇప్పించిన సింగరేణి సేవా సమితి వారికి మరియు రామగుండం 2 ఏరియా జనరల్ మేనేజర్ గారికి మాయొక్క పెద్దంపేట/ మంగళిపల్లి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

**- శ్రీ శ్రీనివాస్, శ్రీమతి కాసిపేట పుష్పలత, గ్రామ సర్పంచ్.**



# మణుగూరు టిటిసి సిల్వర్‌జూబ్లి ఉత్సవములు






మణుగూరు టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్‌లో సిల్వర్‌జూబ్లి ఉత్సవం ది.5.12.2009న ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ జె.వి.దత్తాత్రేయులు, డైరెక్టర్ (ఆపరేషన్స్) విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణుగూరు టిటిసి ది.6.12.1984న ప్రారంభించంబడిందని, ఒసిపిలో పనిచేసే టెక్నీషియన్స్‌కు ట్రైనింగ్ మరియు రిఫ్రెషర్ ట్రైనింగ్ కూడా ఇవ్వబడుతోందని పేర్కొన్నారు. ఇప్పటివరకూ 13,594 మంది కార్మికులకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని, ఒసిపి గనులలో ఉత్పత్తి మరియు ఉత్పాదకత పెంచడానికి టిటిసి దోహదపడిందన్నారు. రాబోవు రోజులలో కూడా ఇదేవిధంగా సేఫ్టీతో కూడిన ఉత్పత్తిని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి టిటిసి తన సేవలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా **'ఓపెన్‌కాస్ట్ గనులలో వ్యయాన్ని తగ్గించుటకు అనుసరించవలసిన పద్దతులు'**పై ఒక వర్క్‌షాప్ నిర్వహించారు. విశిష్ట అతిథిగా శ్రీ కె.జె.అమర్‌నాథ్ సి.జి.ఎం., (హెచ్.ఆర్.డి.) పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు టిటిసిలో పనిచేయుచున్న ఉద్యోగస్తులను అభినందించారు. శ్రీ నామా వెంకటేశ్వరరావు బ్రాంచి సెక్రటరీ, ఎ.ఐ.టి.యు.సి. మాట్లాడుతూ కార్మికులకు టిటిసిలో ఇచ్చే ట్రైనింగ్ వలన ఒసిపిలో పనిచేసే కార్మికులు భారీయంత్రాలమీద పూర్తి అవగాహన కలిగి సేఫ్టీతో ఉత్పత్తిని తీస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పి.కె.ఒ.సి.లో పనిచేయుచున్న కార్మికులు స్వీట్లు పంచినారు. పై కార్యక్రమానికి శ్రీ ఆర్.ఎస్.మంత్రి, జి.ఎం. అధ్యక్షత వహించారు. శ్రీ ఎం.ఎస్.వెంకటరామయ్య, ఎస్.ఒ. టు జి.ఎం., శ్రీ సి.హెచ్.జయరామకృష్ణ ప్రాజెక్ట్ ఆఫీసర్, పికెఒసి, శ్రీ ఒ.త్రినాధరావు, ఎ.జి.ఎం. (ఇ&ఎం), శ్రీ ఎల్.వి.సూర్యనారాయణ, డి.జి.ఎం., ఒ.సి.-4, శ్రీ జి.మోహన్‌రెడ్డి, ఎస్.ఒ.ఎం. ఒ.సి.-2, శ్రీ ఎం.రామకృష్ణ, డి.జి.ఎం. (పర్సనల్), శ్రీ వెంకటనారాయణ, సీనియర్ ఎకనామిస్ట్, శ్రీ శ్రీధర్, డి.జి.ఎం. (ప్లానింగ్) పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గడచిన 25 సంవత్సరాలలో పనిచేసిన ఉద్యోగస్తులైన శ్రీ కె.వి.ఎస్.రాంప్రసాద్, శ్రీ జి.వరదరాజన్, శ్రీ ఎ.జంపయ్య, శ్రీ కె.రాజిరెడ్డి, శ్రీ బి.జ్ఞానేశ్వరరావు, శ్రీ బి.శ్రీనివాస్, శ్రీ సి.పి.సి.రెడ్డి, శ్రీ డబ్ల్యు.మురళీ మనోహర్ మరియు శ్రీ ఇ.రాజిరెడ్డిలను సన్మానించారు.

## స్ఫూర్తి సంచికపై స్పందన



ఒకే కుటుంబం – ఒకే లక్ష్యం – ఒకే గమ్యం అనే నినాదంతో మన సింగరేణి సంస్థ అనేక స్ఫూర్తిదాయక విజయాలు సాధిస్తూ ముందుకెళ్తున్న మన సింగరేణి తల్లి కడుపులో ఇన్ని విజయ గాథలు ఇంతమంది స్ఫూర్తిదాతలు ఉన్నారని ఇంకెందరో తెలియని కార్మిక కుటుంబాలకు స్ఫూర్తి పుస్తకం ద్వారా తెలియ జేసినందుకు మన ఛైర్మన్ మరియు మన ప్రజా సంబంధాలశాఖ అధికారులకు అన్ని ఏరియాల మన కో-ఆర్డినేటర్లందరికి నాయొక్క హృదయ పూర్వక అభినందలు తెలియజేస్తున్నాను.

**– శ్రీ ఎజ్జ రాజయ్య, ఎల్.హెచ్.డి. ఆపరేటర్, జిడికె-8 ఇంక్లయిన్, ఆర్.జి.-2 ఏరియా.**

---

సింగరేణి సంస్థ ఛైర్మన్‌గార్కి మా ధన్యవాదాలు. మీరు విడుదల చేసిన స్ఫూర్తి పుస్తకము ఎంతో ఆకర్షితముగా ఉంది. ప్రతి ఒక్క కళాకారులను గురించి ఆనందపరచినది. వారికి మాయొక్క కృతజ్ఞతలు, వందనాలు, సంగీతం, సామాన్యశిల్పకళ గురించే కాక, అనేక కళల గురించి మీరు వ్రాసినందుకు మాయొక్క హృదయపూర్వక ధన్యవాదాలు.

**– శ్రీ కె.శ్రీనివాస్, కొత్తగూడెం.**

---

సింగరేణి స్ఫూర్తిలో ప్రచురించిన ప్రతి ఒక్క కళాకారునికి వివిధ వృత్తులలో ప్రతిభ కనబరిచిన ప్రతి ఒక్కరికి సింగరేణీయునిగా నా కళాభివందనాలు తెలియచేస్తూ, ఈ ఆలోచన వచ్చిన ఎడిటర్‌గార్కి అసోసియేట్ ఎడిటర్స్‌కు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

ఎన్నో విషయాలు, ఎన్నో కబుర్లు, కలంకు అందని ఆలోచనలు మన స్ఫూర్తి పత్రిక తెలియచేస్తుంది. ఒక్క విషయము గమనించ గలరని మనవి చేయుచున్నాను. ఎందరో కళాకారులు, కళాభిమానులు మన సింగరేణి సంస్థలో ఉన్నారు. మన 'టీ.వి.' కార్యక్రమములో ప్రతి ఏరియా నుండి కళాకారులను ఎన్నుకొని, వారితో మంచి, మంచి కార్యక్రమములు చేయించండి. మా గనికి రండి, సింగర్ ఆఫ్ ది సింగరేణి, సింగరేణి లిటిల్ చాంప్స్ లో ఏరియా వారి కళాకారులను ఎన్నుకొని వారి ప్రతిభను వెలికి తీసుకురాగలరని మనవి చేయుచున్నాను.

**– శ్రీ కె.ఎల్.బి.రావు, స్పెషల్ గ్రేడ్ క్లర్క్, రామగుండం-1.**

---

**ఎస్.ఎం.ఎస్. సందేశం**

ఈ రోజే నేను సింగరేణి స్ఫూర్తి చదివాను. ఇది చాలా స్ఫూర్తిదాయకంగా, విజ్ఞానవంతంగా ఉంది. ఇటువంటివి మరిన్ని తీసుకురావాలని కోరుతున్నాను.

**10.04.2010** **– శ్రీ భిక్షమయ్య, నాయకులు సి.ఐ.టి.యు.**






సింగరేణి సంస్థ వలన నేను ఒక ఉద్యోగంలో (ఆర్మీ)లో చేరినాను. సింగరేణి కోచింగ్ సార్ వద్ద ఆర్మీ గూర్చి మొత్తం తెలుసుకొని, సింగరేణి సంస్థ ఇచ్చిన కోచింగ్ తీసుకొని నేను కర్నూల్ సెలక్షన్స్‌కు పోయి ఆర్మీలో మొదటి అవకాశంలో సెలక్ట్ అయినాను. సింగరేణి సంస్థకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఇలాంటి కోచింగ్ క్యాంప్‌లు ఇంకా పెట్టి నాలాంటి ఎందరికో మేలు చేయాలని కోరుతున్నాను.

**– శ్రీ పిడుగు హరీష్, ఆర్మీ సోల్జియర్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా.**

## సింగరేణి మహిళా నీకు అభినందనలు



మహిళ ఈ పదం శక్తిస్వరూపం, సృష్టికి ప్రతిరూపం, సమాజంలో సగభాగమైన స్త్రీకి సరియైన స్వేచ్ఛ గౌరవం లభిస్తున్నాయా అనేది ప్రశ్నార్థకమే? మహిళ తన పూర్తి స్వేచ్ఛా, స్వాతంత్రాలను అందిపుచ్చుకునే చక్కని వాతావరణం మన సింగరేణి సంస్థలో ఉండటం ఎంతో గర్వించదగిన విషయం. శతాబ్ది పైచిలుకు కాలంగా సింగరేణి అభివృద్ధి ప్రయాణంలో కేవలం ఉత్పత్తి లక్ష్యాలే కాదు, సంస్థలో పనిచేసే ప్రతీ వ్యక్తి కుటుంబం తన కుటుంబంగా భావించి ఎన్నో బృహత్తర సేవా కార్యక్రమాలు చేపడుతూ దీనిలో భాగంగా సింగరేణి మహిళకు సముచితమైన స్థానం కల్పిస్తూనే ఉంది మన సంస్థ. సింగరేణి మహిళ పరిపూర్ణమహిళగా ఎదగడానికి వైద్యవిభాగం ద్వారా వైద్యం, సేవా విభాగం ద్వారా అక్షరాస్యత, స్వయం ఉపాధి ద్వారా ఎన్నో రకాల వృత్తులలో శిక్షణ, వికాసానికి, విజ్ఞానానికి విలువనిచ్చే ఎన్నో క్రీడల పోటీలు, సామూహిక, సాంఘిక కార్యక్రమాలతో, సంస్థ తన స్నేహహస్తాన్ని అందిస్తూనే ఉంది. తారతమ్యభేదాలు లేకుండా ఇక్కడ ప్రతీ మహిళా తన వ్యక్తిత్వాన్ని అభివ్యక్తం చేసుకొనే దిశగా ఓ భార్యగా, తల్లిగా, విద్యార్థికురాలిగా, ఉద్యోగినిగా, వ్యాపారిణిగా, కళాకారిణిగా, సాంఘిక సేవకురాలిగా, ఆధ్యాత్మికురాలిగా వివిధ రకాల విశిష్ట పాత్రలలో తన స్వయంకృషితో ఎదిగే ప్రయత్నంలో సింగరేణి మహిళ సఫలీకృతమవుతూ వస్తోంది. అనంత జీవనది ప్రవాహంలా తనని తాను మెరుగులు దిద్దుకుంటూ ఉత్తేజాన్ని నింపుకుంటూ ఉరకలు వేస్తూ, ఎందరికో చేయూతనిస్తూ, మునుముందుకు తాను సైతం అంటున్న సింగరేణి మహిళా నీకు అభినందనలు.

**– శ్రీమతి కె.పద్మావతి,**
**భర్త: కె.ఎస్.ఎన్.రాజు, డి.వై.ఎస్.ఇ.ఓసిపి-3, ఆర్.జి.-2 ఏరియా.**

# విద్యుత్‌రంగం అభివృద్ధికి 11 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు కావాలి

## "అందరికీ విద్యుత్తు కావాలంటే అభివృద్ధి జరగాల్సిందే"

దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, మన ఆర్థికవ్యవస్థ పురోగతిని దృష్టిలో ఉంచుకొని దేశంలో విద్యుత్ ఉత్పాదకరంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికోసం సుమారు 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరమవుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ.) ఇటీవల విడుదలచేసిన ఒక నివేదికలో పేర్కొంది. అందరికీ విద్యుత్ నినాదం నిజం చేయాలంటే సామర్థ్యానికి తగినంత విద్యుత్తును ఉత్పత్తి చేయడంతోపాటు కొత్త కర్మాగారాలను కూడా నిర్మించాల్సి ఉంటుంది. 2017 నాటికి విద్యుత్‌కు డిమాండ్ రేటు 7.5 నుంచి 8 శాతం వరకు పెరగవచ్చునీ, కనీసం 2014 నాటికి 80-85 గిగావాట్స్ విద్యుత్తును దేశం ఉత్పత్తి చేయగలగాల్సి ఉంటుందనీ నివేదిక పేర్కొంది. అంటే ఈమేరకు బొగ్గు ఉత్పత్తులు కూడా పెరగాల్సి ఉంటుందన్నమాట.

## మైనింగ్ సెక్టార్‌లో భారత్ - చైనాల మధ్య బృహత్ సహకార బంధానికి అవకాశం

చైనా కౌన్సిల్ - జనరల్ మావో - సివి భారత్ చైనా దేశాల మధ్య మైనింగ్ రంగంలో బృహత్ సహకారబంధానికి గొప్ప అవకాశాలు ఉన్నాయని భారతదేశంలోగల చైనా కౌన్సిల్ - జనరల్ మావో సివి తన ఆశాభావం ప్రకటించారు. ఇటీవల జరిగిన 3వ ఏసియన్ మైనింగ్ కాంగ్రెస్‌లో ప్రసంగిస్తూ భారత్, చైనా ఆర్థికబంధాల గురించి ప్రస్తావించారు. "ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో 40 శాతం చైనా దేశం నుంచే జరుగుతోంది. రెండవస్థానంలో భారతదేశం ఉంది. అలాగే భారత్‌తో అత్యధిక శాతం వ్యాపార బంధంగల దేశం చైనాయే! ఇంతేకాక చైనా, భారత్ భౌగోళిక, సాధారణ పరిస్థితులన్నీ ఒకేవిధంగా ఉంటుంటాయి. ఇటువంటి సారూప్యతల దృష్ట్యా భారత్-చైనాల మధ్య మైనింగ్ రంగంలో కూడా విస్తృత స్థాయి సహకారబంధం నెలకొనాల్సిన అవసరం ఉందన్నారు.

## వచ్చే బడ్జెట్ సమావేశాల్లో వేలం ద్వారా బొగ్గు బ్లాకుల కేటాయింపు బిల్లు


లోక్‌సభలో వచ్చే బడ్జెట్ సమావేశంలో వేలం ద్వారా బొగ్గు బ్లాకుల కేటాయింపుకు అనుమతి కోరుతూ ఒక బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. బొగ్గు వినియోగదారులు వేలం పాటలో బొగ్గు బ్లాకులను పొందేందుకు ఇది దోహదపడుతుంది. అక్టోబర్-2008లో రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఇప్పుడు లోక్‌సభలో చర్చకు, ఆమోదానికి ప్రవేశపెట్టనున్నారు. ఈ విషయాలను కేంద్ర బొగ్గుశాఖ సహాయ మంత్రి శ్రీ ప్రకాష్ జైస్వాల్ - ఇటీవల జరిగిన ఏసియన్ మైనింగ్ కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రస్తావించారు. 'దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బొగ్గు బ్లాకుల కేటాయింపు గురించి ఎటువంటి అనుమానాలూ అక్కర్లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు.

## స్వంత బ్లాకునుంచి బొగ్గు తవ్వకం ప్రారంభించిన సెయిల్ (ఎస్.ఎ.ఐ.ఎల్.)

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్.ఎ.ఐ.ఎల్.) తనకు బొగ్గు అవసరాల కోసం 5 బొగ్గు బ్లాకులు తీసుకోగా, వీటిలో మూడింటినుంచి బొగ్గు తవ్వకాలను ప్రారంభించింది. ఈ కంపెనీకి ఝార్ఖండ్ రాష్ట్రంలో ఛాస్నాల, జిత్‌పూర్, తస్రా, సిటానాల బ్లాకులు, పశ్చిమబెంగాల్‌లో రాంనగర్ బ్లాకూ కేటాయించబడ్డాయి. సెయిల్ డైరెక్టర్ (కాలరీస్) యు.పి.సింగ్ కోల్ ఇన్‌సైట్స్‌కి ఇచ్చిన కథనం ప్రకారం "ఝార్ఖండ్‌లో పర్యావరణ క్లియరెన్స్ లభించిన తస్రా బొగ్గు బ్లాకునుంచి తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఓపెన్‌కాస్టు పద్ధతిలో ఇక్కడ కాంట్రాక్టరు ద్వారా బొగ్గు తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఏడాదికి 40 లక్షల టన్నుల బొగ్గు ఈ గనినుంచి లభించనుంది. తొలిదశలో లభిస్తున్న థర్మల్‌కోల్‌ను బాయిలర్స్‌లో ఉపయోగిస్తున్నారు. ఇంకా లోతులోకి వెళ్లిన తర్వాత లభించే కోకింగు బొగ్గును స్టీలు తయారీకి వాడనున్నారు.

ఇరుగు-పొరుగు

## కోలిండియాలో ఖ్యాతికెక్కిన ఎన్.సి.ఎల్. - అన్నీ ఓసీ గనులే !!



కోలిండియా సబ్సిడరీలలో నార్తరన్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్.సి.ఎల్.) ప్రముఖమైంది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఎన్.సి.ఎల్. కేవలం ఓసీగనుల ద్వారా మాత్రమే బొగ్గును ఉత్పత్తి చేస్తున్న కంపెనీగా దేశంలో పేరు తెచ్చుకొంది.

మధ్యప్రదేశ్‌లోగల సింగ్రౌలీ ప్రాంతంలో ఇది ప్రధానంగా కేంద్రీకృతమై ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లో సోనెభద్ర ప్రాంతంలో కొంతమేర గనులు కలిగి ఉంది. కేవలం 10 ఓసీగనులతో ఏటా 67 మిలియన్‌టన్నులు (2009-10)లో సాధిస్తూవస్తోంది. 2011-12 నాటికి 76 మిలియన్ టన్నులకు దీని ఉత్పత్తిని పెంచుకోవాలని చూస్తోంది.

**ఓసీ గనుల పేర్లు - (కెపాసిటీ) :** నిగాహి (15 మి.ట), అమ్‌లోర్హి (10మి.ట), దూచికువా (10మి.ట.), జయంత్ (10 మి.ట), బినా (6 మి.ట.), జింగుర్దా (3 మి.ట.), కాక్రి (3 మి.ట.), ఖాడియా (4 మి.ట.), క్రిష్ణశిల (4 మి.ట.), బ్లాక్-బి (3.5 మి.ట.)

**మిషినరీ :** మొత్తం 1,000 భారీ యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. వీటిలో 19 డ్రాగ్‌లైన్ యంత్రాలు. 170, 120, 85 టన్నుల సామర్థ్యం గల 500 భారీ డంపర్లు. 10 నుంచి 20 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంగల 80 షవల్స్, ఇంకా మిగిలిన యంత్రాలు ఎన్.సి.ఎల్. ఉత్పత్తిరంగంలో గల బలగాలు.

**వినియోగదారులు :** ఉత్పత్తి చేసే బొగ్గులో 96 శాతం విద్యుత్ ఉత్పత్తి సంస్థలకే కేటాయిస్తున్నారు. వినియోగదారుల్లో ఎన్.టి.పి.సి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ విద్యుత్ సంస్థలతోపాటు ఐ.పి.జి.ఎల్., హెచ్.పి.జి.ఎల్. హిండాల్కో, కనోరియా కెమికల్స్ వంటి భారీ సంస్థలున్నాయి.

**సమీప గ్రామాల కోసం :** సమీప గ్రామాల అభివృద్ధికి ఏడాదికి (2008-09) 2 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రానున్న కాలంలో 4 నుంచి 10 కోట్ల ఖర్చుతో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పనులు చేయాలని ఎన్.సి.ఎల్. భావిస్తోందని సంస్థ ఛైర్మన్ కోల్ ఇన్‌సైట్‌తో అన్నారు.

## చైతన్యానిదే చరిత్ర - శ్రమశక్తిదే భవిత!

తరతరాలుగా సింగరేణి
తన వారిని కాపాడగ
సమస్యలెన్ని ఎదురైనా
తట్టుకుని వస్తున్నది.
లక్షల ప్రాణాలను అక్కున చేర్చుకుని
బ్రతుకుదెరువు ఇస్తున్నది
ఇలా మన సింగరేణి
నిలవాలి గెలవాలి
అందరం ఒక త్రాటిమీద
ఒక్కటిగా నిలవాలి.
నీ శ్రమతో ప్రజా సంస్థ
నిలబడి గట్టెక్కినప్పుడు
ఫలాలన్ని సమిష్టిగా
ప్రజలకు చేకూరినపుడు
ముందుతరం వారసులకు
నీ చమటే చుక్కానై
బ్రతుకు బాట చూపినపుడు
భవిత కాపాడినపుడు
అంతకన్నా ఈ జన్మకు
'ధన్యతే' ఏమున్నది.
గర్వంగా చెప్పుకునే
సార్థకత ఏమున్నది.
గత దశాబ్ది పాఠాలను
'పరిణతి' తో అనుసరిస్తు
మూలాలు పెకలకుండా
మార్గాలను ఎంచుకుంటు
వ్యాపారపు పోటీలను
'సమర్థత'తో ఎదుర్కొంటు
మరో వంద వసంతాలు
సింగరేణి ఉండేలా
ప్రతి ఒక్కరు ప్రతినబూని
అడుగు ముందుకేయాలి
మదిలో పనిలో గనిలో
'ప్రగతే' ధ్యేయం కావాలి.

**శ్రీ జి.రాజేందర్‌రెడ్డి, జి.ఎం., ఆర్.జి.-2**

## జయ జయహో జనని సింగరేణి

ప: జయ జయ జయమహో జనని సింగరేణి
విజయోస్తు, శుభమస్తు మా సిరులవేణి
గోదావరి తీరాన కొలువున్న ప్రియ జనని
ఎందరికో అన్నదాతగా నిలిచిన పావని
అందుకోమ్మ అందుకో మా నిత్య పూజలు
అందుకో మా అందరి శతకోటి హారతులు
॥జయ జయ॥

చ. గృహవసతి కల్పిస్తు, ఉచిత వైద్యమందిస్తు
రక్షణను పాటిస్తు, ఉత్పత్తికి బాటలేస్తు
లక్ష్యాలను అధికమించె నల్లమణి సింగరేణి
ఆనందం అందించె పావన బృందావని
॥జయ జయ॥

చ. సిమెంటు, భారరుల కాగితం పరిశ్రమలకు
రైల్వేలు, థర్మల్ విద్యుత్ ప్లాంటులకు
తన బొగ్గును అందిస్తు, పరిశ్రమల ప్రగతినందిస్తు
దేశానికి వెన్నెముకగ నిలిచిన దయామయి
॥జయ జయ॥

చ. అన్ని వృత్తి పనివారికి సమన్యాయం అందిస్తు
ఆశ్రిత జనులందరికి జీవన భృతి కల్పిస్తు
దక్షిణ భారతదేశ మణిదీపమై వెలిగేటి
పరమపతిత పావని, పరమ పూజ్యదాయిని
॥జయ జయ॥

చ. ఖమ్మం, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్
జిల్లాల్లో విస్తరించి బొగ్గు పంట పండిస్తు
ముమ్ముందుకు సాగుతున్న ప్రగతి కల్పవల్లి
నిత్యసేవలందించే తేజోమయ రూపవల్లి
॥జయ జయ॥

చ. పర్యావరణం పెంచుతూ, క్రమశిక్షణ పాటిస్తు
నాణ్యతను కాపాడి, నైపుణ్యం పెంచుతు
విజయపథం సాగుతోంది మన జనని సింగరేణి
ప్రగతిపథం నడుస్తోంది మన బంగరు ప్రియధరిణి
॥జయ జయ॥

**- ఎస్.రామాచారి, ఎం.ఏ., ఫిట్టర్, ఏరియా వర్క్‌షాప్, ఇల్లెందు.**

## రక్షణ గీతం

గనుల్లో రక్షణ సూత్రలు పాటించూ...
భద్రతా అవార్డును సాధించు...
ఆ..... ఆ..... ఆ......
భద్రతా అవార్డును సాధించు...
ఉళ్లు కోసేటి కోలు కట్టరు
మిస్‌ఫైర్లను గమనించన్న
రూపూ-ఫైడు పెంచకురన్న
రూలు ప్రకారము పనిచేయన్న ॥ఓ... గనిలో॥
సపోర్టు జేసేటి టింబరింగన్న
చటాయిముందూ చేయాలన్న
రూటుకు టైటుగ దాటును పెట్టి
గట్టి సపోర్టు చేయాలన్న ॥ఓ... గనిలో॥
టబ్బులు ఇచ్చే ట్రామరు అన్న
టబ్బులపైకి ఎక్కకురన్న
సొకెటు పిన్ను సరిగాజూసి
సేఫ్టి లాకును మరువకురన్న ॥ఓ... గనిలో॥
హాలరు డ్రైవరుకు అడ్డమయ్యేల
సిగ్నలు గంటలు కొట్టాలన్న
తాడుకు మించిన టబ్బులు పెట్టి
ప్రమాదాలను చేయబోకుర ॥ఓ... గనిలో॥
టబ్బులు నింపే లాడీసన్న
తొందరపాటు వలదోయన్న
తట్టకు మించిన పెళ్లలుపెట్టకు
తలకుమించిన బరువుయోయకు ॥ఓ... గనిలో॥
రక్షణయే మన కర్తవ్యంగా
ఉత్పత్తే మన ఆశయంబుగా...
జాతీయస్థాయిలో సింగరేణిని
సిరులపంటగా నిలపాలన్న ॥2॥ ॥ఓ... గనిలో॥

**చిట్యారి యుగంధర్, జనరల్ మజ్దూర్, జె.వి.ఆర్. ఓ.సి., సత్తుపల్లి**

## పులకరింత

అందమైనది ఈ సుందర ప్రకృతి
కాలుష్యంతో కప్పబడింది దాని ఆకృతి
కాపాడుకుంటేనే మనకు పురోగతి
చెట్లు తోడులేకుంటే అధోగతి.
గళగళ పారే సెల ఏరులు...
ఒంకలు తిరిగిన డొంకలు..
కోయిల పాటల కమ్మని రాగాలు...
కావా! మరి అవి ప్రకృతి అందాలు.
కానీ!
ఫ్యాక్టరీ గొట్టాలనుండి వెలువడే పొగలు...
సన్నగిల్లును ఆకాశంలో ఓజోను పొరలు..
భరించలేము ఇక వేసవి పగలు...
విరజిమ్మో సూర్య ప్రతాప వెడిమిసెగలు.
నరికి నిర్లక్ష్యం చేసిన వనాలు...
మనకు కురియవసలే వానలు...
ఋతుపవనాలకు ఆధారం చెట్లు...
వృక్ష సంపదే దేశసంపదకు మెట్లు...
మనం సింగరేణి కార్మికులం...
ప్రగతి బాటకు వారసులం...
రక్షణోత్పత్తి మన లక్ష్యం...
పర్యవరణ పరిరక్షణ మన లక్షనం.
చేయి చేయి కలుపుతే చప్పట్లు...
మొక్కకు మొక్క తోడైతే తీరును నీటి ఇక్కట్లు..
నీవు... నేను ఏకమైతే.... నిజం..
పచ్చదనం పరుతోంది ఈ జగం.

**- బొట్టుపల్లి వెంకటేశ్వర్లు, మణుగూరు.**

## సింగరేణి దండు

అదిగదిగో కదిలింది సింగరేణి దండూ
గలగలగల పారే సెలయేరులా వస్తుంద్రూ ॥అదిగదిగో॥
తలకు టోపి పెట్టుకుని, కాళ్లకు బూట్లేసుకుని
దీటైన మొనగాళ్ళు, సింగరేణి కార్మికులు
రక్షణ కవచాలతో రాజుల్లా వస్తుంద్రూ ॥అదిగదిగో॥
గనిలోన పనిలోన, ఎదురయే ఆపదలను
రక్షణ సూత్రాలతో, లక్షణంగా నివారించి
చకచకమని పదపదమని గనినుండి పైకొస్తురు ॥అదిగదిగో॥
ఉత్పత్తె లక్ష్యంగా, ఒక్కటై పనిచేస్తరు
ఆటపాటలందు వీరు, అన్నింటా ముందుంటరు
ఎలుగెత్తి చాటుతరు సింగరేణి వీరులమని ॥అదిగదిగో॥

**- కె. రాజలింగయ్య, సెక్యూరిటీగార్డు, ఎస్ అండ్ పి.సి., రామగుండం.**

# పాత జ్ఞాపకాలు

1957 జూలై మొదటివారంలో అప్పటి మన రాష్ట్రపతి డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ కొత్తగూడెం ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గనిలోకి వెళ్తున్న దృశ్యం ఇది. రెండవసీటులో గల డా॥ రాజేంద్రప్రసాద్ గారిని మొదటిసీటులో గల అప్పటి మన ఛైర్మన్ శ్రీ ఎస్.కె.నర్గోంద్కర్ చూడవచ్చు.






1964లో రుద్రంపూర్ డివిజనల్ కాలరీస్‌లో వెంకటేష్ ఖని యొక్క షాఫ్ట్ తవ్వకాలను అప్పటి మద్రాస్ గవర్నర్ శ్రీ బిష్ణురామ్‌మేదీ ప్రారంభిస్తున్న దృశ్యం ఇది. చిత్రంలో అప్పటి రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి (ఎడవ చివర), ఎ.జి.ఎం. శ్రీ ఎల్.ఆర్.శర్మ (కుడి చివర) ఉన్నారు.




115 సంవత్సరాలపాటు మన కంపెనీకి సేవలందించి చెక్కు చెదరకుండా నిలిచిన లేత్ మిషన్ ఇది. కొత్తగూడెంలోని సెంట్రల్ వర్క్‌షాపులో ఆంగ్లేయుల కాలంలో ఏర్పాటు చేయబడిన ఈ మిషన్‌పై కనీసం నాలుగుతరాల కార్మికులు పనిచేశారు. విశేష సేవలందించిన ఈ యంత్రం ఒక సజీవ పాత జ్ఞాపకంగా నిలిచి ఉంది.

విజ్ఞప్తి : పై పాత జ్ఞాపకాలను మన సింగరేణీయులే పంపించారు. మీరు లేదా మీ ముందు తరాల సింగరేణీయుల వద్ద ఇటువంటి పాత జ్ఞాపకాలు ఏమున్నా సరే పంపించగలరు. మీ పేరుతో సహా ప్రచురిస్తాం. సంప్రదించండి : 9491140128 E-mail : patrikae8@gmail.com

# పచ్చని పర్యావరణం కోసం లక్షలాది మొక్కల పెంపకం

## అంతరించిపోతున్న వృక్షజాతులకు పునర్జీవనం

మన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలలో ఏటా లక్షలాది మొక్కలను పెంచుతున్నాం. వీటిని అటవీ పర్యావరణశాఖల నేతృత్వంలో ఓపెన్‌కాస్ట్ డంప్‌లమీద, కంపెనీ ఖాళీ ప్రదేశాలలో, కాలనీలు, పార్కులలో నాటుతున్నాం. ఇలా నాటిన మొక్కలు నేడు పలు ప్రదేశాలలో కృతిమ వనాలుగా తయారై అలరిస్తున్నాయి. మన కంపెనీకి ఇందిరాగాంధీ వృక్షమిత్ర అవార్డ్, తెరీ గోల్డెన్ పీకాక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ అవార్డ్‌లు మొదలైనవి రావడంలో ఈ నర్సరీల కృషి ఎంతో ఉంది. ముఖ్యంగా అడవులనుంచి అంతరించిపోతున్న జిట్రేగి, బండారు, రక్తచందనం, మొదుగు, తాని, బట్టగనుము వంటి కొన్ని వృక్షజాతులకు మన నర్సరీలో జీవం పోసి ఓ.బి. డంప్‌లపై వనాలుగా పెంచుతున్నాం. మన నర్సరీల నిర్వహణ ఉత్తమస్థాయిలో ఉండడం మూలానా ఐ.ఎఫ్.ఎస్. ట్రైనీలకు ఇవి దర్శనీయ కేంద్రాలుగా గుర్తించబడ్డాయి. మీరు ఇక్కడ చూస్తున్న చిత్రాలు కొత్తగూడెంలోని నర్సరీ లోనివి. ఇక్కడ సుమారు నలభై జాతులకు చెందిన ఆరు లక్షల మొక్కలు పెంచుతున్నాం. జూలై నెలనుంచి మొక్కలను ముమ్మరంగా నాటడం జరుగుతుంది. ఈ నర్సరీలో వానపాముల వలన తయారయ్యే వర్మి కంపోస్ట్ ఎరువులను, వేప ఆకులతో తయారయ్యే క్రిమి సంహారక మందులను వాడుతున్నాం. కంపెనీ నర్సరీల నుంచి వానాకాలంలో మొక్కలు పంపిణీ చేసే సమయాన మీరూ మీవంతుగా కొన్ని మొక్కలు సేకరించండి. వాటిని నాటండి. పచ్చని అడవుల పెంపకంలో మనమూ భాగస్వాములము కావాలంటే మొక్కలు నాటాలి. "తరంతరం నిరంతరం ప్రకృతితో అనుబంధం" కొనసాగించడానికి ఈ నర్సరీలే మూలాధారాలు.



నారెప మొక్కలు



మోదుగ మొక్కలు



బట్టగనము మొక్కలు



తాని మొక్కలు



బండారు మొక్కలు



యూఫోర్బియా మిలీ (హైబ్రీడ్) మొక్కలు

# ప్రగతిపథంలో మన సింగరేణి



అడ్రియాలాషాఫ్ట్ నిర్మాణానికి సంబంధించి ఒక కంపెనీతో మన సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా మన ఛైర్మన్ & ఎం.డి. శ్రీ ఎస్.నర్సింగ్‌రావుతో పాటు మన డైరెక్టర్లు శ్రీ జె.వి.దత్తాత్రేయులు, శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్.



రామగుండం-3 ఏరియాలోగల జి.డి.కె.10-ఎ గనిలో జనవరి 11న మేన్‌రైడింగ్ సిస్టమ్‌ను ప్రారంభించిన మన డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీ జె.వి.దత్తాత్రేయులు



గోలేటి ఉద్యానవనాన్ని మార్చి 30వ తేదీన ప్రారంభిస్తున్న మన డైరెక్టర్ (ప్లానింగ్ & ప్రాజెక్ట్స్) శ్రీ డి.ఎల్.ఆర్.ప్రసాద్. చిత్రంలో బెల్లంపల్లి జి.ఎం. శ్రీ సి.వి.రెడ్డి, శ్రీరాంపూర్ సి.జి.ఎం. శ్రీ శేషుకుమార్‌రెడ్డి, మందమర్రి జి.ఎం. శ్రీ ఆంథోనిరాజా తదితరులు.



బెల్లంపల్లిలో సింగరేణి సేవా సమితి ద్వారా నిరుద్యోగ యువకులకోసం ఉద్దేశించిన ఉచిత మోటార్ డ్రైవింగ్ శిక్షణను ఫిబ్రవరి 28న ప్రారంభిస్తున్న మన డైరెక్టర్ (పా) శ్రీ కె.వి.రమణ, ఐ.ఏ.ఎస్.



ఐ.ఐ.ఎం.లో అత్యుత్తమ ర్యాంక్ (99.98%) సాధించిన భాస్కర కాశ్యప్‌కు వారి తల్లిదండ్రులు శ్రీ యు.వేంకటేశ్వర్లు, (జె.ఎ.), శ్రీమతి సుబ్బలక్ష్మిల సమక్షంలో మార్చి 30న మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తున్న శ్రీ ఐ.వి.ఎన్.ప్రసాదరావు, డైరెక్టర్ (ఇ అండ్ ఎం)



కాంట్రాక్ట్ కార్మికులకు సి.ఎం.పి.ఎఫ్. చిట్టీలను రామగుండం ఏరియాలో మొట్టమొదటి సారిగా ఇటీవల సి.జి.ఎం. శ్రీ మనోహరరావు, కార్మికనాయకులు శ్రీ గట్టయ్య అందజేసినప్పటి చిత్రం.



రామగుండం-3 ఏరియా పరిధిలోని అక్కిపల్లి గ్రామంలో ఫిబ్రవరి 7వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి పర్యవేక్షిస్తున్న సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఉమారాణి



మణుగూరు ఏరియా కొత్త కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న సేవా కార్యదర్శి శ్రీమతి శైలజ వెంకటరామయ్య.

Printed & Published by : Sri S. Chandra Sekhar, C.P.R.O. on behalf of Singareni Collieries Company Ltd.
Singareni Bhavan, PB No. 18, Red Hills, Hyderabad-500 004. A.P. Printed at : Sairam Printers, Hyderabad. Tel : 040-23232316